

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఉమ్మడి వరంగల్

హన్మకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు

సోమవారం | 5 | మే | 2025 | పేజీలు : 18


గ్రామ గ్రామానికి రవాణా సౌకర్యం కల్పించాం

హైటెక్ తరహాలో ఆరు నెలల్లో బస్టాండ్ ఏర్పాటు చేయడానికి చర్యలు

ప్రజల అభిప్రాయం మేరకే ప్రజా పాలన కొనసాగింపు

రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ములుగు జిల్లా కేంద్రంలో 4.80 కోట్లతో నూతన ఆర్టీసీ బస్ స్టేషన్ కి శంకుస్థాపన చేసిన మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క



# ములుగు ప్రజల దశాబ్దాల కల నెరవేర్చాం

ములుగు, సూర్య ప్రతినిధి మే 4 (మేజర్ న్యూస్): ములుగు జిల్లా ప్రజల దశాబ్దాల కళ జిల్లా కేంద్రంలో నూతన బస్టాండ్ ఏర్పాటుతో నెరవేర్చబోతున్నామని, హైటెక్ తరహాలో నూతన బస్టాండ్ ను ఆరు నెలల లోపు పూర్తి చేసి ప్రారంభించడం జరుగుతుందని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలన్నింటికీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. లతో కలిసి నాలుగు కోట్ల 80 లక్షల రూపాయలతో చేపట్టనున్న నూతన బస్టాండ్ నిర్మాణ పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు మిగతా 2లో..

కౌలు రైతులను నిండా ముంచిన

# అకాల వర్షం

మోరంచ వాగు వెంట భారీగా నేల వాలిన వరి పంటలు

పెట్టుబడి కూడా నష్టపోతామని రైతుల ఆవేదన

ముందే కౌలు చెల్లించిన రైతుల పరిస్థితి దయనీయం

ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతుల విజ్ఞప్తి



2 లో

దత్తాత్రేయ ఆలయ వార్షికోత్సవం ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు



2 లో

మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం

## ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల

క్యూఆర్ కోడ్ ద్వారా ఫోన్ లోనే దరఖాస్తు చేసుకోవచ్చు

మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ అనిత




కమలాపూర్ మే 04 మేజర్ న్యూస్ సూర్య : తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం ప్రవేశానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ అనిత ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈ నెల 05 తేది నుండి 20 వ తేది లోపు ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను 26 తేదిన ప్రకటిస్తారని తెలిపారు. ఎస్ఎస్సి పబ్లిక్ పరీక్షలలో వచ్చిన మెరిట్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వ రిజర్వేషన్ నిబంధన ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. తెలంగాణ మోడల్ స్కూల్ లో మిగతా 7లో..




# ములుగు ప్రజల దశాబ్దాల కల నెరవేర్చాం

మొదటి పేజీ తరువాయి..

జిల్లాకు చేరుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ కు మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గట్టమ్మ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రులు భారీ ర్యాలీగా జిల్లా కేంద్రానికి చేరుకోగా అభిమానులు గజమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజల అభిప్రాయం మేరకే ప్రజా పాలన ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతుందని, తాము ఇచ్చిన హామీలను కాకుండా నూతన పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ 1989లో నిర్మించగా ప్రస్తుతం బస్టాండ్ పరిస్థితి బాగాలేదని సోదరీమణి సీతక్క తెలుపగానే నూతన బస్టాండ్ నిర్మాణానికి నిధులు కేటాయించామని, మంగపేట మండలంలో 50 లక్షల రూపాయలతో నూతన బస్టాండ్ నిర్మాణ పనులు పూర్తి అవుతున్నాయని అన్నారు. రానున్న రోజులలో మంగపేట మండల కేంద్రంలోని నూతన బస్టాండును ప్రారంభించడమే కాకుండా ఏటూరు నాగారం మండల కేంద్రంలో ఏడు కోట్ల రూపాయలతో చేపట్టనున్న బస్ డిపో పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని వివరించారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని ప్రేమనగర్ వద్ద గిరిజన యూనివర్సిటీ, సమీకృత కలెక్టరేట్ కార్యాలయం, వైద్య కళాశాల ఉన్న కారణంగా ఎకరం స్థలంలో 45 లక్షల రూపాయలతో నూతన బస్టాండ్ నిర్మాణ పనులను చేపట్టడం జరుగుతుందని హామీ ఇచ్చారు. మహిళలను





ఆర్థికంగా బలోపేతం చేయడానికి మహిళా సంఘాల వారిచే 600 బస్సులను కొనుగోలు చేసి బస్సు యజమానులుగా చేశామని, ములుగులో చేపట్టనున్న నూతన బస్టాండ్ నిర్మాణ పనులను చేపట్టిన ప్రగతిని ప్రతినెల అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దేశంలోనే తెలంగాణను రోల్ మోడల్ గా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని, రాష్ట్రంలో తాము కుల గణన చేయడంతోనే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి దేశవ్యాప్తంగా కులగనన చేయడానికి ముందుకు వచ్చిందని, దీనిపై కేంద్ర మంత్రులు రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ములుగు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి మంత్రి సీతక్క చొరవ చూపడం అర్శించదగ్గ విషయమని కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు ప్రాంతం ఒకప్పుడు గ్రామీణ ప్రాంతంగా అనంతరం మండల ప్రాంతంగా జిల్లా ప్రాంతంగా ఏర్పడిన అనంతరం ములుగు గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా ప్రభుత్వం గెజిటెడ్ నోటిఫికేషన్ విడుదల చేసిందని, ములుగు జిల్లాలో పలు ప్రాంతాలలో నూతన బస్టాండ్ నిర్మాణ పనులు చేయడానికి నిధులు కేటాయించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి నేడు రాష్ట్రంలో బీసీల పాలిట దేవుడుగా మారి 42 శాతం రిజర్వేషన్ సాధించడం గొప్ప విషయమని, జిల్లా కైంద్రాన్ని రోల్ మాడల్ గా తీర్చిదిద్దడానికి రానున్న రోజులలో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ములుగు ప్రాంతం పర్యాటక ప్రాంతంగా మారడంతో ఎలాంటి పనులకైనా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి నిధులు కేటాయిస్తున్నారని, మిస్ వరల్ కార్యక్రమంలో భాగంగా సుందరిమణులు రామప్పను సందర్శించనున్న దృశ్య ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. నూతన బస్టాండు నిర్మాణంతో ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోనున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాల్మన్ రాజ్, డిప్యూటీ ఆర్ఎంఓ భాను కిరణ్, ఆర్డీవో వెంకటేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్, డిపో మేనేజర్లు జ్యోత్స్న, రవి చందర్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## దత్తాత్రేయ ఆలయ వార్షికోత్సవం

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు



కాటారం, మే 04, మేజర్ సూర్య న్యూస్: రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు స్వగ్రామం కాటారం మండలంలోని ధన్వాడలో దత్తాత్రేయ స్వామి ఆలయ 3 వ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా కొనసాగింది. మంత్రి శ్రీధర్ బాబు, గ్రామస్తులతో కలిసి ఆలయంలో గణపతి పూజ 54 ప్రత్యేక కలశములు ఏర్పాటు చేసి దత్తాత్రేయ స్వామి కి అభిషేకము దత్త హోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులు దత్తాత్రేయుని దైవ దర్శనం చేసుకున్నారు. భక్తులకు మహాన ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ దత్తాత్రేయ స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు ఎప్పుడు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని, సకాలంలో వర్షాలు కురిసి రైతులకు అధిక దిగబడులు రావాలని కోరారు. ప్రత్యేక ఆహ్వానితులుగా అడ్డూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు అడ్డూరి లక్ష్మణ్ కు మేమెంటో ఇచ్చి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేమనూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులను నిండా ముంచిన అకాల వర్షం

గణపురం రూరల్, మే 04 మేజర్ న్యూస్ సూర్య: ఈదురు గాలులు అకాల వర్షాలు కౌలు రైతులకు నిండా ముంచాయి. మరో 15 రోజుల్లో పంట చేతికి వస్తుందనుకున్న తరుణంలో గత బుధ గురువారాల్లో భారీ ఈదురు గాలులు వర్షాలు రైతుల పాలిట శాపంగా మారాయి. ముందే కౌలు చెల్లించిన రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. నాట్లు వేసిన మొదట్లోనే వివిధ రకాల తెగుళ్లతో ఇబ్బందులు పడి భారీగా పెట్టుబడులు







పెట్టి పంటలను కాపాడుకున్న కౌలు రైతులు అకాల వర్షంతో నిండా ముని గారు. గణపురం మండలం నగరంపల్లి చెందిన కౌలు రైతు గొర్రె ప్రశాంత్ యాదవ్ 5 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా పంట మొత్తం నేల వాలింది. భారీ వర్షం వల్ల పంట పొలాల్లో నీరు నిలిచి ఉండడం వల్ల కింది భాగంలో ఉన్న వరి పంటకు మొలకలు వస్తున్నాయి. గత రెండు వ్యవసాయ సీజన్లలో కూడా రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ప్రభుత్వం వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి నష్టపోయిన కౌలు రైతులకు పరిహారం ఇవ్వాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి పాడి క్లీనర్ ద్వారా శుభ్రపరచి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

### నర్సంపేట మార్కెట్ యార్డ్ను సందర్శించినజిల్లా కలెక్టర్

నర్సంపేట టౌన్, మే 04, మేజర్ న్యూస్ సూర్య: వర్షం వల్ల తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి పాడి క్లీనర్ ద్వారా శుభ్రపరచి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ఆదివారం నర్సంపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్లో గల పిఎసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఇటీవల అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసినట్లు తెలిపిన నేపథ్యంలో మార్కెట్లో అధికారులు, రైతులు తీసుకుంటున్న జాగ్రత్తలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అకాల వర్షాల ప్రభావం నుంచి ధాన్యాన్ని రక్షించేందుకు రైతులు టార్పాలిన్ కప్పి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షం వల్ల తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి, పాడి క్లీనర్ ద్వారా శుభ్రపరచి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కొనుగోలు కేంద్రాల నిర్వహణ, సిబ్బంది పనితీరు, ధాన్యం నాణ్యత, రైతుల అవసరాలు, డబ్బు చెల్లింపులు తదితర అంశాలను పరిశీలించారు. ధాన్యాన్ని వేగవంతంగా మిల్లులకు తరలించాలని అధికారుల కలెక్టర్ ఆదేశించారు. కేంద్రాలలో ప్యాడి క్లీనర్ లు, గన్ని బ్యాగులు, తాగునీరును అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా పూర్తి పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలన్నారు. ధాన్యం రవాణాకు సరిపడా వాహనాలను, ధాన్యం ఎగుమతులు, దిగుమతులు వెంటనే జరిగేలా అవసరమైన హమాలీలను సమకూర్చుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు



చేసిన రెండు రోజుల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు జమ అయ్యేవిధంగా ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా మేనేజర్ సంధ్యారాణి, ఆర్డీఓ ఉమారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, కార్యదర్శి జి.రెడ్డి, తహసీల్దార్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.





# ప్రాచీన భారత ఋషుల గొప్ప చరిత్రలో మహర్షి భగీరథునిది ప్రత్యేక స్థానం

### అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి

భూపాలపల్లి సూర్య ప్రతినిధి మే 04 మేజర్ న్యూస్ ప్రాచీన భారత ఋషుల గొప్ప చరిత్రలో మహర్షి భగీరథునిది ప్రత్యేక స్థానమని ఆయన





మహాతపస్విగా, ప్రజల క్షేమం కోసం గంగా నదిని భూలోకానికి తీసుకురావడంలో చేసిన అశ్రాంత ప్రయాసల ఫలితంగా ఆయన పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. ఆదివారం ఐడిఓసి కార్యాలయంలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి ముఖ్య అథిగా పాల్గొని భగీరథ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహర్షి భగీరథ సేవలను స్మరించుకున్నారు. ఆమె మాట్లాడుతూ మహర్షి భగీరథ సేవా దృక్పథం ప్రజల పట్ల ఉన్న బాధ్యత భావాన్ని మన జీవితాల్లో అలవర్చుకోవాలని సూచించారు. మహర్షి భగీరథ ఆశయాలను నేటి సమాజంలో అమలుపరచుకోవడమే ఆయనకు నిజమైన నివాళి అని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి క్రాంతి కిరణ్, సగర సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రమౌళి, సగర సంఘం మహిళ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి సత్యవతి కృష్ణ, సగర యువజన సంఘం జిల్లా అధ్యక్షులు హేమంత్, బిసి సంఘం బాద్యులు సత్యనారాయణ,కార్యాలయ సిబ్బంది వివిధ కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష ప్రశాంతం



## పరీక్షా కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ సూర్య ప్రతినిధి, మే 04, మేజర్ న్యూస్ సూర్య: జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలలో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 4680 మంది గాను 4574 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. 106 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. నీట్ పరీక్షకు హాజరైన అభ్యర్థుల హాజరు శాతం 97.73 గా నమోదయింది. జిల్లాలో అత్యంత పకడ్బందీగా నిర్వహించిన ఈ పరీక్ష మధ్యాహ్నం రెండు నుండి





సాయంత్రం ఐదు గంటల వరకు సాగింది. హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య రెండు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. కాజీపేట మండలం కడిపికొండ శివారులోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ, సుబేదారిలోని యూనివర్సిటీ పోస్ట్ గ్రాడ్యుయేట్ కళాశాలలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించి అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్ష కేంద్రాలలో పరీక్ష జరుగుతున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు బాలరాజు, నవీన్ కుమార్, ఇతర అధికారులతో పాటు పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

## వేసవి దృష్ట్యా ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తగా తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ అర్బన్ ,మే 04 ,మేజర్ న్యూస్ సూర్య: వేసవి తాపం రోజు రోజుకి పెరిగిపోతున్న వేళ ఎక్కువగా ఇబ్బంది పెట్టే సమస్య వడదెబ్బ. అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత కారణంగా బయట పనికి వెళ్లే వారే కాక, ఇంట్లో ఉండే వృద్ధులు, చిన్నారులు కూ డా వడదెబ్బకు గురయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయని, ఈ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు పాటిస్తే వడదెబ్బ తగలకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వడదెబ్బకు గురైనప్పుడు సరైన చర్యలు తీసుకోకపోతే ప్రాణాలు కూడా కోల్పోయే అవకాశం ఉంటుందని, ఈ క్రమంలో శరీరానికి తగినంత నీరు అందించడం, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించడం, మధ్యాహ్న వేళలో బయటకు వెళ్లకపోవడం, అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే గొడుగు వెంట తీసుకువెళ్ళడం, ముఖానికి, తలకు స్కార్ఫ్, టోపీ పెట్టుకోవడం, వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించి చికిత్స సకాలంలో తీసుకోవాలని కోరారు.

#### వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు...

శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుకోవాలివేసవిలో శరీరానికి తగినంత నీరు అందించడం చాలా అవసరం. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి, ముఖ్యంగా చల్లటి నీరు, ఓఆర్ఎస్ ద్రావణం, పండ్ల రసాలు వంటివి సేవించాలని తెలిపారు.

#### వదులైన దుస్తులు ధరించాలి...

వేసవిలో వదులుగా ఉండే వస్త్రాలను ధరించడం మంచిదని తెలిపారు. రంగుల దుస్తులను ధరించడం వల్ల సూర్య రశ్మి శరీరంపై ఎక్కువ ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.

#### వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి...

వడదెబ్బ లక్షణాలు (తలనొప్పి, విరోచనాలు, మైకం, అధిక జ్వరం, తల తిప్పడం, స్పృహ కోల్పోవడం) కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలన్నారు.

#### చిన్నారులు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ...

పిల్లలు, వృద్ధులు ఎండలో ఎక్కువ సేపు ఉండకూడదని, వీలైనంత వరకు ఇంట్లోనే ఉండడం మంచిదన్నారు.

#### మందులు సక్రమంగా ఉపయోగించాలి...

ఏదైనా మందులు తీసుకుంటున్నట్లయితే వైద్యుడి సూచనల ప్రకారం మందులు తీసుకోవడం శ్రేయస్కరని పేర్కొన్నారు.

## మోడల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరానికి దరఖాస్తుల ఆహ్వానం

గణపురం, మే 04 మేజర్ న్యూస్ సూర్య: గణపురం మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాల, లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైందని ఈనెల 5 నుండి 25 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ తిరుపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల లో ఎంపీసీ బైపిసి ఎంఈసి సిఇసి గ్రూపుల్లో 40 చొప్పున సీట్లు ఉన్నాయని ఆయన తెలిపారు. 'http ://183.82.97/mstg" లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థుల ఎంపిక ప్రక్రియ పదవ తరగతి మెరిట్ ప్రభుత్వ రిజర్వేషన్ ప్రక్రియ ఆధారంగా జరుగుతుందని. కళాశాల లో ఇంగ్లీష్ మీడియంలో బోధనతో పాటు నీట్ పోటీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు,నిపుణులైన ఉపాధ్యాయ బృందంతో కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్, స్కాలర్షిప్ లు,ల్యాబ్ లు,క్రీడలు, సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్ ఎన్నో అవకాశాలు సౌకర్యాలు అందుబాటులో ఉంటాయన్నారు. పదవ తరగతి విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ తిరుపతి విజ్ఞప్తి చేశారు.

# లిటిల్ మేధా ప్రీ స్కూల్ ప్రారంభోత్సవం

హసన్పర్తి, మే 4, మేజర్ న్యూస్ (సూర్య): హన్మకొండ నయీమ్ నగర్ లో అత్యున్నత విద్యా ప్రమాణాలతో లిటిల్ మేధా ప్రీస్కూల్ ప్రారంభించినట్టు సంస్థ డైరెక్టర్లు సి ఏ శృతి నరేంద్ర కందగట్ల తెలిపారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి గారు హాజరై.. రిబ్బన్ కట్ చేసి పాఠశాల ప్రాంగణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత చిన్నారుల అభిరుచికి తగ్గట్టుగా లిటిల్ మేధా స్కూల్ దోహదపడుతుందని పేర్కొన్నారు. అతిథులుగా హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి హాజరై.. ఆడిటోరియంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆహ్లాదకర







వాతావరణంలో పాఠశాల ప్రారంభించి యాజమాన్యంను అభినందించారు. విశిష్ట అతిథులుగా మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్ హాజరై ఆఫీస్ రూమ్ ప్రాంగణానన్నీ ప్రారంభించారు. టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, బిజెపి జిల్లా నాయకులు రావు పద్మ, కార్పొరేటర్ గుంట రజిత శ్రీనివాస్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కెళ్ళపల్లి రాజేశ్వరరావు తదితరులు హాజరైనారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ అంజలి జోషి, గంప రవికుమార్, నరేష్ కోరే, వల్లాల రమేష్,నరేష్ అద్వాల, వైనాల స్వామి, రాజేంద్రప్రసాద్, కుంభం నరేష్ రెడ్డి, చింత సతీష్, జంగాపల్లి సతీష్, తాటిపల్లి శ్రీధర్, గుండేటి సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో తన వంతు పాత్రగా

### గొత్తికోయలతో ప్రత్యేక అనుబంధం ఏర్పరచుకుంటున్న చక్రవర్తి హాస్పిటల్ ఎండి డాక్టర్ తరుణ్ రెడ్డి

### పుట్టినరోజు సందర్భంగా 35 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీకి సిద్ధం





ములుగు, సూర్యప్రతినిధి మే 4 (మేజర్ న్యూస్) : ఉన్నతమైన చదువులు చదివి విలాసవంతమైన జీవితాన్ని ఆస్వాదించే అవకాశం ఉన్న నిరుపేదలకు సేవ చేయాలని ఉన్నత లక్ష్యం కొంతమందికి మాత్రమే ఉంటుంది. క్షణం తీరికలేకుండా ఉన్నప్పటికీ తన వంతుగా సమాజానికి సేవ చేయాలనే గొప్ప లక్ష్యంతో ముందుకు వెళ్తున్న చక్రవర్తి హాస్పిటల్ ఎండి డాక్టర్ తరుణ్ రెడ్డి గొప్ప దాతృత్వానికి నిదర్శనంగా నిలుస్తున్నారు. ఆసుపత్రిలో ఎంత పని ఒత్తిడి ఉన్న, రోగులతో ఎంత బిజీగా ఉన్నా సామాజిక సేవలు మాత్రం ఆయన మరవడం లేదు. సామాజిక సేవలో తన వంతు పాత్రగా మంత్రి సీతక్క అడుగుజాడల్లో నిరుపేదలందరికీ విద్యా వైద్యం అందించాలని అత్యంత గొప్ప లక్ష్యంతో డాక్టర్ తరుణ్ రెడ్డి ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలోనే గతంలో ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం బుస్సాపూర్ గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి సుమారు రెండు లక్షల రూపాయల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అంతేకాక ములుగు జిల్లా తాడ్వాయి మండలం తక్కెళ్ళపాడు గుత్తి కోయగూడెంలో మంత్రి సీతక్క సహకారంతో ములుగు డిఎస్పి రవీందర్ సహాయ సహకారాలతో సంయుక్తంగా అధునాతన సౌకర్యాలతో కూడిన పాఠశాలను తరుణ్ రెడ్డి ఏర్పాటు చేశారు. అక్కడి గొత్తికోయలతో ఉన్న అనుబంధాన్ని మరోసారి గుర్తు చేసుకోవడంతో పాటు తన పుట్టినరోజు వేడుకలను ఎంతో నిరాడంబరంగా తక్కెళ్ళపాడు గుత్తి కోయగూడెంలో జరుపుకునేందుకు ఆయన సిద్ధమయ్యారు. సోమవారం తన పుట్టినరోజు సందర్భంగా అంతేకాక నివసిస్తున్న 35 కుటుంబాలకు 30 రోజులకు సరిపడా నిత్యవసర సరుకులను అందజేయనున్నారు. వైద్య వృత్తి తో పాటు సామాజిక సేవలో తన వంతు కృషి చేస్తున్న తరుణ్ రెడ్డిని మంత్రి సీతక్క ములుగు జిల్లా ప్రజలు అధికారులు అభినందిస్తున్నారు.







# పలకరింపు.. ఆప్యాయతలతో వెల్లివిరిసిన బాల్య స్నేహం

### 20 సంవత్సరాల తర్వాత కలుసుకున్న బాల్య స్నేహితులు

### ఆనంద సందోహంలో అపూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాయపర్తి మే 4(మేజర్ న్యూస్ సూర్య) : 20 సంవత్సరాలు కిందట వారంతా కలిసి ఒకే పాఠశాలలో చదువుకున్నారు. తరువాత వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. ఆదివారం తిరిగి అదే పాఠశాలలో కలుసుకొని నాటి మధుర జ్ఞాపకాలను నెమరేసుకొని పంచుకున్నారు. దీంతో కొలనుపల్లి జడ్పీఎస్ఎస్ పాఠశాల ఆవరణం ఆనంద పరవశంతో నిండింది. పాఠశాలలో 2004 – 2005 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు వారి ఆత్మీయ సమ్మేళనం అపూర్వంగా జరుపుకున్నారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించు కుంటూ కుటుంబ సభ్యుల బాగోగులు తెలుసుకున్నారు. చదువుతున్న రోజుల్లోని జ్ఞాపకాలను పంచుకొని ఉబ్బి తబ్బిపోయారు. వారు చేస్తున్న పనులను ఉద్యోగాలను తెలుసుకొని వారి యొక్క కష్టసుఖాల గురించి ఆరా తీశారు కలిసి చదువుకున్న తరగతి గదులను,బ్లాక్ బోర్డులను చూసుకుంటూ ఒక్కింత భావోద్వేగానికి గురయ్యారు. క్రీడా





మైదానంలో కలియ తిరుగుతు చిన్న పిల్లల గంతులు వేశారు. అందరూ కలిసి విందు భోజనాలు అరగించి గ్రూప్ ఫొటోలు దిగి నూతన జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు గణేష్, ప్రసాద్, శ్రీధర్, అయ్యగారు, శ్రీనివాస్, ఎల్ల రాజులకు పూల గుచ్ఛాలు, మెమొంటో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ప్రతి సంవత్సరం 10వ తరగతిలో మొదటి, రెండవ, మూడవ స్థానాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 516 రూపాయలు, షీల్ ప్రోత్సాహంకంగా అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి కావలసిన వాటికి కూడా సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లకావత్ విజయ్ నాయక్, ప్రకాష్, కుమార్, నగేష్, జనార్ధన్, ప్రవీణ్,ఆలాపన, శ్రీలత, కల్పన, చిన్న, శ్రీలత, స్వాతి , సునీత, మమత తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా గౌడ కులస్తుల పోచమ్మ బోనాలు

**పోచమ్మ బోనాలతో సందడిగా మారిన కమలాపూర్ గ్రామం**

**ప్రజలను అలరించిన శివసత్తుల నృత్యాలు, డప్పుల వాయిద్యాలు**

కమలాపూర్ మే 04 మేజర్ న్యూస్ సూర్య : హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో ఆదివారం గౌడ కులస్తులు భక్తి శ్రద్ధలతో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుండి మహిళలు సంప్రదాయ బోనాలను ఎత్తుకుని, పంబాల వారి డప్పుల వైద్యాల మధ్య డీజే సౌండ్ తో ఊరేగింపుగా పోచమ్మ గుడి వరకు వెళ్లారు. శివ సత్తుల ప్రత్యేక నృత్యాలు, యువత డప్పుల వాయిద్యాలు అందరినీ అలరించాయి. బోనాల ఊరేగింపులో పెద్ద సంఖ్యలో గౌడ కులస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఆలయం వద్ద బోనాలను పోచమ్మ అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కమలాపూర్ గౌడ సంఘం పెద్దలు విజయవంతంగా నిర్వహించగా గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు.



# ఏజెన్సీలో గౌడ సొసైటీలను పునరిద్ధరించాలని మంత్రి ప్రభాకర్ గౌడ్ కు వినతి

ములుగు రూరల్, మే 4( మేజర్ న్యూస్ సూర్య) : ఏజెన్సీలో గౌడ సొసైటీలను పునరిద్ధరించి ఎజెన్సీ గీతకార్మికులకు న్యాయం చేయాలని గౌడసంఘాల ఐక్య వైదిక ఆధ్వర్యంలో ములుగు జిల్లా అధ్యక్షుడు ముంజా బిక్షపతిగౌడ్ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మంత్రి సీతక్కలకు వినతి పత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో మోడల్ బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపనకోసం ములుగు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను ములుగు గట్టమ్మవద్ద గౌడ సంఘాల జేఏసి ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గౌడ సంఘాల నాయకులు ఏజెన్సీ ప్రాంతంలో గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మంత్రి ప్రభాకర్ గౌడ్ కు వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీలోని గీత కార్మికుల అభివృద్ధికి ప్రత్యేక సంక్షేమ పథకాలను అమలు చేయాలని, తొలగించిన సొసైటీలను పునరిద్ధించాలని, తాటి చెట్టు పై నుండి పడి మరణించిన గీత కార్మిక కుటుంబానికి రూ. 10 లక్షలు ఎక్స్ గ్రేషియా పెంచాలని, తాడిచెట్టుపై నుండి పడి శాశ్వత వికలాంగులైన బాధితులకు రూ.5 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, తాటి, ఈత చెట్ల పెంపకానికి ప్రతి గౌడ సొసైటీకి 5 ఎకరాల భూమి ఇవ్వాలని కోరారు. గీత కార్మికులకు ప్రభుత్వం ద్విచక్ర వాహనాలు ఉచితంగా ఇవ్వాలని, గీత కార్మికులకు రూ. 5000ల పింఛన్ ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. ములుగు జిల్లా కేంద్రంలో గౌడ్ లకు కమ్యూనిటీ భవనం నిర్మించాలని, జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలని, గీత కార్మికులకు కాటమయ్య కిట్లు ఇవ్వాలని కోరారు.



స్పందించిన మంత్రిలు పొన్నం ప్రభాకర్ గౌడ్, సీతక్కలు బీసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డితో ఫోన్ చేసి అర్హులైన గీత కార్మికులకు కాటమయ్య కిట్లు ఇవ్వాలని ఆదేశించారు. మంత్రులకు వినతిపత్రం అందజేసిన వారిలో ముంజాల బిక్షపతి గౌడ్, ఏజెన్సీ గౌడ్ హక్కుల సంగం ములుగు జిల్లా అధ్యక్షులు కారుపోతుల నరసన్నగౌడ్, మోకుదెబ్బ ములుగు జిల్లా అధ్యక్షుడు గుండెబోయిన బిక్షపతి గౌడ్, జేఏసీ ములుగు జిల్లా నాయకులు తడుక హరీష్ గౌడ్, తడక సాయి కిరణ్ గౌడ్, తడుక రవీందర్ గౌడ్, గొల్లపెల్లి శోభన్ గౌడ్, చంద్రగిరి నాగరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నిఘా నేత్రాలతో నేరాలను అరికట్టవచ్చు

**సుబ్బక్కపల్లిలో సీసీ కెమెరాలపై అవగాహన సదస్సు**

**టేకుమట్ల ఎస్ఐ దాసరి సుధాకర్**

టేకుమట్ల మే 04 మేజర్ న్యూస్ సూర్య : ప్రతి గ్రామంలో నిఘా నేత్రాల ( సీసీ కెమెరాల ) తో నేరాల ను త్వరితగతిన చేదించి అరికట్టవచ్చని టేకుమట్ల ఎస్ ఐ దాసరి సుధాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం మండలంలోని సుబ్బక్క పల్లి గ్రామంలో సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఎస్ఐ దాసరి సుధాకర్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో గ్రామీణ ప్రాంతాలలో అనేక చోట్ల దొంగతనాలు, అవాంఛనీయ సంఘటనలు, సంభవిస్తున్నాయని, ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ,సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వలన గ్రామంలో ఎలాంటి దొంగతనం కానీ, అవాంఛనీయ సంఘటన గాని సంభవించితే సీసీ కెమెరాల ద్వారా గుర్తించవచ్చని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దని, అపరిచిత వ్యక్తులు గ్రామంలో సంచరించినట్లయితే పోలీసు శాఖకు సమాచారం అందించాలని ఆయన అన్నారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులకు సహకరించి, అవాంఛనీయ సంఘటనలో పాల్పంచుకుంటే చట్టం పరిధిలో శిక్షలు తప్పవు అని టేకుమట్ల ఎస్ఐ దాసరి సుధాకర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పట్టణంలో ఆరోమా ది కేఫ్'ను ప్రారంభించిన ఝాన్సి రాజేందర్ రెడ్డి



తొర్రూర్ మే 4 మేజర్ న్యూస్ (సూర్య) : తొర్రూర్ పట్టణ కేంద్రంలో ఖమ్మం వరంగల్ జాతీయ రహదారి పక్కన పట్టణంలో అత్యాధునిక సదుపాయాలతో నిర్మించబడిన 'ఆరోమా ది కేఫ్'ను ఆనందం సాయి సంతోష్ (బబ్బులు), పడాల ప్రవీణ్, కొనుకటి ముఖేష్ రెడ్డి, లు ఏర్పాటు చేయగా, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అనుమాండ్ల ఝాన్సి రాజేందర్ రెడ్డి ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి కేఫ్ను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రాంతీయ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. ఆరోమా ది కేఫ్ వంటి ఆధునిక కేఫ్ల గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, వినోదానికి, విశ్రాంతికి ఒక మంచి వేదికగా నిలుస్తాయి, అన్నారు. చిన్న స్థాయి పరిశ్రమలు, వ్యాపారాలు ఎదగాలంటే ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు సామాజిక భాగస్వామ్యంతో ముందుకు సాగాలని తెలిపారు.కేఫ్ యాజమాన్యాన్ని అభినందించిన వారు, ఇలాంటి ఆధునికతను గ్రామీణ స్థాయిలో తీసుకురావడం అభినందనీయమైన విషయం అన్నారు. యువతకి





స్ఫూర్తిదాయకంగా ఈ కేఫ్ ఉండాలన్నారు. మరిన్ని ఇలాంటి వ్యాపారాలు ప్రారంభమై, నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆనందం సత్యనారాయణ, అనపురం రవి , గజ్జల వెంకటేశ్వర్లు బ్లాక్, కాంగ్రెస్ పట్టణ, మండల, అధ్యక్షులు, స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు, కేఫ్ యాజమాన్యం, యువత, మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణ

**పైలట్ ప్రాజెక్టు కింద రెండవ విడతలో**

**స్టేషన్ ఘనపూర్ మండలం ఎంపిక**

**పక్కా ప్రణాళికతో రెవెన్యూ సదస్సులను చేపట్టాలి**

**రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి**

**రెవెన్యూ సదస్సుల నిర్వహణకు 12 మందితో రెండు బృందాల ఏర్పాటు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లకు బాధ్యతలు**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగామ అర్బన్, మే 04, మేజర్ న్యూస్ సూర్య: భూ భారతి చట్టాన్ని పక్కాగా అమలు చేయాలనే ఉద్దేశంతో భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ఆదేశించిందని, వీటిని అధికారులు పక్కాగా నిర్వహించాలని ₹జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ఆదివారం జిల్లాలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్₹నేటి నుంచి చేపట్టనున్న రెవెన్యూ సదస్సుల ఏర్పాట్లు, అలాగే అధికారులు పాటించాల్సిన విధివిధానాలపై ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓ, తహసీల్దార్ లతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ  పైలట్ ప్రాజెక్టులో భాగంగా రెండవ విడతగా జిల్లాలోని ఘనపూర్ (స్టేషన్) మండలం ఎంపికైందని, అక్కడ రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులను నిర్వహించి, వారికి ఉన్న భూ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు గాను ఈ నెల 5 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించే ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెవెన్యూ సదస్సులను సజావుగా చేపట్టేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేశామని, అందులో భాగంగా ఒక్కో బృందానికి 12 మంది చొప్పున రెవెన్యూ అధికారులను నియమించామని, ఇందుకోసం ఇద్దరు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లను పర్యవేక్షణ అధికారులుగా బాధ్యతలను అప్పగించినట్లు ₹కలెక్టర్ తెలిపారు. సదస్సులో బ్యానర్, తాగునీరు, తదితర కనీస మౌలిక వసతులు సమకూర్చాలని, అలాగే సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, సరిపడా భూ సమస్యల వివరాల దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచుకోవాలని, భూ సమస్యల దరఖాస్తుల వివరాలను రిజిస్టర్ లలో అత్యంత జాగ్రత్తగా నమోదు చేయాలని, ఎక్కడా కూడా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని సూచించారు. సదస్సులు జరిగే ప్రతిరోజూ అధికారులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. ధ్రువీకరణ పత్రం అందజేయాలని, భూ సమస్యల దరఖాస్తులలోని వివరాలను ఆన్లైన్ లో కూడా నమోదు చేయాలని, రోజూ వారీగా నివేదికను సమర్పించాలని, ఎటువంటి సమస్య తలెత్తకుండా చూడాలని, ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.దరఖాస్తుదారులు ఏదైనా సమస్య పైన దరఖాస్తు ఇచ్చేటప్పుడు దానికి సంబందించిన ఆధారాలను కూడా సమర్పిస్తే అట్టి సమస్య త్వరగా పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు.  ఘనపూర్ (స్టేషన్) మండలంలో జరిగే రెవెన్యూ సదస్సుల వివరాలు...మే 5న విశ్వనాథపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయ పరిధిలో, అలాగే కొత్తపల్లి, గ్రామ పంచాయతీ కార్యాలయ పరిధిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మే 6న తానేదార్ పల్లి, గ్రామ పంచాయతీ కార్యాలయ పరిధిలో, అలాగే రాఘవాపూర్, గ్రామ పంచాయతీ కార్యాలయ పరిధిలో, మే 7న నమిలిగొండ, గ్రామ పంచాయతీ కార్యాలయ పరిధిలో, అలాగే మీదికొండ, గ్రామ పంచాయతీ కార్యాలయ పరిధిలో, మే 8న ఘనపూర్ (స్టేషన్), రైతు వేదిక పరిధిలో, అలాగే ఛాగల్, రైతు వేదిక పరిధిలో, మే 9న తాటికొండ, రైతు వేదిక పరిధిలో, అలాగే పామ్నూర్, గ్రామ పంచాయతీ కార్యాలయ పరిధిలో,మే 12న సముద్రాల గ్రామ పంచాయతీ కార్యాలయ పరిధిలో, అలాగే శివునిపల్లి, జెడ్పీఎస్ఎస్ పరిధిలో, మే 13న ఇప్పగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయ పరిధిలో రెవెన్యూ సదస్సు లను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.



## గుండెపోటుతో మూడు నెలల బాలింత మృతి

**మండల కేంద్రంలో విషాదం**

**కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు**



గణపురం రూరల్ మే 04 మేజర్ న్యూస్ సూర్య: గణపురం మండల కేంద్రానికి చెందిన మూడు నెలల బాలింత మాల పూజిత ( 23) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం బోయిని సాంబయ్య  కూతురు పూజితను అదే గ్రామానికి చెందిన మాల నగేష్ కు ఇచ్చి నాలుగు సంవత్సరాల క్రితం వివాహం చేశారు.ఈ దంపతులకు 3సంవత్సరాల కుమారుడు  మూడు నెలల పాప ఉన్నారు. మూడు నెలల బాలింత కావడంతో పూజిత తమ తల్లి గారి ఇంటి వద్దే ఉంటుంది. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో పూజిత మూత్ర విసర్జనకు వెళ్లి వచ్చి పడుకుంది అనంతరం పక్కనే పడుకున్న మూడు నెలల పాప ఎంత ఏడ్చిన మృతురాలు పూజిత నిద్రలేవక పోవడంతో పూజిత తల్లి కవిత వెళ్లి  కూతురు నునిద్ర లేపడానికి ప్రయత్నించినా మృతురాలు నిద్ర లేవక పోవడంతో వెంటనే 108 వాహనంలో చికిత్స కోసం భూపాలపల్లి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. పూజితను పరీక్షించిన ఆసుపత్రి వైద్యులు  గుండెపోటుతో మరణించి ఉండవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. మృతురాలి తండ్రి సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శిక్షణ ఎస్ఐ అమూల్య ఆధ్వర్యంలో ఆసుపత్రికి వెళ్లి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు పూజిత మృతదేహాన్ని అప్పగించారు.అతి చిన్న వయసులో పూజిత మృతి చెందడంతో మండల కేంద్రంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బంధువులు కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## ప్రభుత్వ ఆదర్శజూనియర్ కళాశాలలో దరఖాస్తులు 5 నుంచి ప్రారంభం

నెల్లికుదురు మే 4 మేజర్ న్యూస్(సూర్య) :మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శజూనియర్ కళాశాల తనదైన శైలిలో ప్రతిభను ఘనపరుస్తూవిద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్నిప్రతి ఏడాది పెంచుతూ వస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ జి ఉపేందర్ రావ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆదర్శ కళాశాలలో మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు మే 5 నుంచి ప్రారంభం కానున్నాయనిప్రిన్సిపల్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూఐదవ తేదీ నుండి 20వ తేదీ వరకు తీసుకున్న దరఖాస్తులను పరిశీలించిదరఖాస్తు చేసుకున్న వారి వివరాలను 26న ప్రకటిస్తామని అన్నారు.సెలెక్ట్ అయిన విద్యార్థులకుఈనెల 27 నుంచి 31 వరకుసర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహి స్తామని ,జూన్ 2 నుంచి మొదటి సంవత్సర విద్యార్థులకుతరగతులు ప్రారంభం చేయనున్నట్లు తెలిపారు.ఇంటర్ మొదటి సంవత్సరంలో ఇంగ్లీష్ మీడియం ఎంపీసీ,బైపిసి,ఎం ఈ సి,సీసీ గ్రూపులలో ప్రతి గ్రూపులో 40 మంది చొప్పునఅడ్మిషన్ తీసుకొనున్నట్లు తెలిపారు.

## తాటిచెట్టు పై నుండి పడి గీత కార్మికుడు మృతి



రాయపర్తి మే 4 మేజర్ న్యూస్ సూర్య : తాటి చెట్టు పై నుండి పడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తూరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది మృతుని బంధువులు స్థానిక పోలీసుల వివరాలు ప్రకారం మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన నాల్లం యాదగిరి ( 55) అనే గీత కార్మికుడు రోజు లాగానే శనివారం సాయంత్రం కులవృత్తులో భాగంగా తాటి చెట్లు ఎక్కుతుండగా కాలు జారీ ఒక్కసారిగా  చెట్టుపైనుండి కింద పడిపోయాడు దీంతో అతనికి తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు అతన్ని వెంటనే వరంగల్ ఆస్పత్రికి తరలించారు చికిత్స పొందుతూ యాదగిరి ఆదివారం ఉదయం మృతి చెందినట్లు వారు తెలిపారు మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు

## గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

**తహసీల్దార్ విజయసాగర్**

వర్ధన్నపేట మేజర్ న్యూస్ సూర్య మే 4: వరంగల్ జిల్లా కలెక్టర్  ఆదేశాల మేరకు భూభారతి చట్టం - 2025 అమల్లో భాగంగా జిల్లాలోని వర్ధన్నపేట మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక కావడం జరిగింది. ఇందులో భాగంగా సోమవారం నుండి అనగా 05-05-2025 నుండి వర్ధన్నపేట మండలంలో ఉన్న 12 రెవెన్యూ గ్రామాలలో రెవెన్యూ సదస్సులను ఈ క్రింది తేదీల ప్రకారం రెవెన్యూ అధికారులు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద అందు బాటులో ఉంటూ సమస్యలుగా ఉన్న భూములకు ధరఖాస్తులు స్వీకరించడం జరుగుతుంది  మే 5వ తేదీన బండవతాపురం, కొత్త పెల్లి,  6 తేదీన ఉప్పరపల్లి, దివిటిపల్లి, 7 తేదీన కట్రియల, 7,8 తేదీలలో ఇల్లంద, 8వ తేదీన లేబర్తి ,9వ తేదీన చెన్నారం,  దమ్మన్నపేట, 12 ,13 వ తేదీలలో నల్లబెల్లి, వర్ధన్నపేట మున్సిపాలిటీ, 14 వ తేదీలలో రామవరం గ్రామంలో గ్రామ సభలు నిర్వహించబడతాయని తహసిల్దార్ విజయసాగర్ తెలిపారు. కావున ఈ క్రింది తేదీల ప్రకారం గ్రామంలో రైతులు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ధరఖాస్తులతో అందుబాటులో ఉండి విజయవంతం చేయగలరు.

## మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల




మొదటి పేజీ తరువాయి..

ఎంపీసీ - 40, బైపిసి - 40, సిఇసి - 40, ఎంఈసి - 40 సీట్లు ఉంటాయన్నారు. ఈ కళాశాలలో విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో ఉచిత విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత నోట్ బుక్ లు, ఈ.ఏ.పి.సి.ఈ.టి/నీట్ కోచింగ్, కేరిర్ కౌన్సెలింగ్, మీడియా అండ్ ఎంటర్టైన్మెంట్ అప్పారెల్, ఫ్యాషన్ డిజైనింగ్ లో వృత్తిపరమైన కోర్సులలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. బాలికలకు హాస్టల్ సౌకర్యం ఉందని కింద ఇచ్చిన క్యూఆర్ కోడ్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి అవకాశం ఇవ్వడం జరుగుతుందన్నారు. మొదటి సంవత్సరానికి హాస్టల్ సీట్లు 60 ఉన్నాయన్నారు.

## అనితరం కాని పనిని సుసాధ్యం చేసిన గొప్ప వ్యక్తి

# భగీరథ మహర్షి

### మంత్రులు పొన్నం ప్రభాకర్, దనసరి సీతక్క

ములుగు, సూర్యప్రతినిధి మే 4 (మేజర్ న్యూస్): అసాధ్యమైన పని తన తపోశక్తితో సుసాధ్యం చేసిన గొప్ప వ్యక్తి మహర్షి భగీరథుడు అని మంత్రులు పొన్నం ప్రభాకర్ ధనసరి సీతక్క లు కొనియాడారు. ఆదివారం శ్రీ మహర్షి భగీరథడు జయంతి పురస్కరించుకొని ములుగు జిల్లా కేంద్రంలో ములుగు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధ్వర్యంలో శ్రీ మహర్షి భగీరథడు జయంతి ఘనంగా నిర్వహించినారు. ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క , జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ శబరిష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ భగీరథ శ్రీ మహర్షి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించినారు. అనంతరం మంత్రులు పొన్నం, సీతక్క లు మాట్లాడుతూ అసాధ్యం కానీ పనిని సాధ్యం చేసే ప్రతి మనిషి భాగీరతుడే అని, పవిత్ర మైన గంగా నదిని స్వర్గం నుండి భూమికి తపస్సు చేసి తిసుకువచ్చిన గొప్ప మహర్షి అనికోనియాడరు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రవీందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు నలువల శ్రీధర్, జిల్లా ప్రసిడెంట్ కోడిపక రవి, జిల్లా



ప్రధాన కార్యదర్శి కురిమిల్ల మహేందర్, కార్యదర్శి కోడిపక మహేందర్, స్టేట్ కమిటి మెంబర్ సోమ వంశీ, జెట్టి పున్నం చందర్, గౌరవ అధ్యక్షులు కోడిపక కట్టయ్య, కనుగల సుధాకర్, నలువల నర్సయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## లక్ష్య సాధనకు మహర్షి భగీరథుడు స్ఫూర్తి




### కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ , మే 04, మేజర్ న్యూస్ సూర్య: లక్ష్య నిర్దేశంతో చేసే ఏ ప్రయత్నంలోనైనా విజయాన్ని సాధించవచ్చని భగీరథ మహర్షి నిరూపించారని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు.ఆదివారం జిల్లా కలెక్టరేట్ లో వెనుకబడిన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ జయంతి వేడుకల్లో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మహర్షి భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ నీటిని దివి నుంచి భువికి తెచ్చిన మహనీయుడు భగీరథ మహర్షి అని అన్నారు. ఆయన్ను స్మరించుకోవడం, జయంతి వేడుకలు జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. మహనీయుల గొప్పతనాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మహనీయుల జీవిత విశేషాలను ప్రజలకు తెలియజేయాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం వేడుకలను నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్ ఓ విజయలక్ష్మి, జిల్లా బిసి సంక్షేమ అధికారి పుష్పలత, జిల్లా అధికారులు బిసి సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.







### నీట్ పరీక్షా కేంద్రాలను సందర్శించిన సిపి





హనుమకొండ సూర్య ప్రతినిధి, మే 04, మేజర్ న్యూస్ సూర్య: నీట్ పరీక్ష కేంద్రాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదివారం సందర్శించారు. ఆరట్స్ అండ్ సైన్స్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లతో పాటు అభ్యర్థులను తనిఖీ చేస్తున్న తీరును సీపీ పరిశీలించారు. ఏసీపీ దేవేందర్ రెడ్డి, సత్య నారాయణతో పాటు స్థానిక ఇన్స్పెక్టర్లు సత్యనారాయణ రెడ్డి, రవి కుమార్, నాగబాబు, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలి



చిట్యాల, మే 4 మేజర్ న్యూస్: మండల కేంద్రంలో ఆదర్శ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థులు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ మేకల రమేష్ తెలిపారు కళాశాలలో ఎంపీసీ, బైపిసి, సీఈసి గ్రూపులలో 40 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆయన అన్నారు. ఆసక్తి గల ఆన్ లైన్ ద్వారా విద్యార్థులు అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. నేటి నుంచి ఈ నెల 20 వరకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. బాలికలకు ప్రత్యేకమైన వసతి గృహం సౌకర్యం ఉందని అన్నారు. ఆన్ లైన్ దరఖాస్తు చేసుకున్న విద్యార్థిని విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఈ నెల 21 నుండి 31 వరకు కొనసాగుతుందని ప్రిన్సిపాల్ రమేష్ చెప్పారు.

# గుమ్మడికాయ దొంగలు అంటే భుజాలు తడుముకున్న చందాగా ఉంది

### కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరు



మంగపేట మే 04, సూర్య(మేజర్ న్యూస్):గుమ్మడికాయ దొంగలు అంటే భుజాలు తడుముకున్న చందాగా కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరు ఉందని బిఆర్ ఎస్ నాయకులు గుమ్మల వీరస్వామి అన్నారు. ఆదివారం ఆ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వీరస్వామి హాజరై మాట్లాడుతూ మార్చి 28 నుండి నేటికి 36 రోజులు కావస్తున్న గ్రామ సభలు జరుపడం లేదని, రమణక్కపేట గ్రామంలో ఉపాధి లేక ఎన్నో బీద కుటుంబాలు ఉపాధి కోసం ఎదురు చూస్తుంటే మానవత దృక్పథంతో ప్రజలకు బాటగా నిలబడి , రమనక్కపేట గ్రామ పంచాయతీకి వచ్చినటువంటి ఇసుక క్వారీలకు గ్రామ సభ జరిపించండి అని, కలెక్టర్ ను డిమాండ్ చేస్తుంటే కాంగ్రెస్ నాయకులకు ఎందుకు కడుపు నొప్పి కలుగుతుందని ప్రశ్నించారు. కలెక్టర్ ఏమన్నా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తన లేక మంత్రి బినామీన అని అన్నారు. ప్రజల కోసం కలెక్టర్ ను విమర్శిస్తే, కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా కలెక్టర్ ను నిలదీసి అడిగి మంత్రి చొరవతో గ్రామసభలు పెట్టించవలసింది పోయి, మా పైనే ప్రతి విమర్శలు చేస్తారా అని మండిపడ్డారు. మా గ్రామంలో ఉన్న ఇసుక క్వారీలకు సకాలంలో గ్రామ సభలు జరిగి ఉంటే గ్రామంలో నివసించే వారికి ఉపాధి కింద రోజుకి 1500/- రూపాయలనుండి 2500/- వరకు సంపాదన దొరికేది, కానీ ఇట్టి గ్రామసభలను కలెక్టర్ అడ్డుకోవడం ఏంటి అని మేము వివరణకోరితే మా పై కాంగ్రెస్ పార్టీ వాళ్ల ప్రతి విమర్శలు చేయించడం చూస్తుంటే, మాకు మా ఊరిలో గ్రామసభలు జరగకపోవడానికి ప్రధాన కారణం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల హస్తము మరియు మంత్రి సీతక్క గారి హస్తములు కూడా ఉన్నాయని అనుమానాలు కలుగుతున్నాయి, ఎందుకంటే కలెక్టర్ ఏ పనికిమాలిన కారణాలు చూపిస్తూ గ్రామ సభను వాయిదా వేస్తున్నాడో, కాంగ్రెస్ పార్టీ వాళ్లు కూడా అదే కారణాలను చూపిస్తూ విమర్శలు చేయడం చూస్తుంటే ఇద్దరు ఒక్కటే అని అర్థమవుతుంది, భూభారత సభలు అకాల వర్షాలు రెండు ఊర్ల మధ్య గొడవలు అని ఇలా లేనివి ఉన్నట్లుగా కల్పితాలు సృష్టించి గ్రామ సభను జరపకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు, మేము ఒక్కటే కలెక్టర్ ని సూటిగా అడుగుతున్నాం కత్తి గూడెం మరియు ఇతర గ్రామాల యొక్క గ్రామసభలు జరిపినప్పుడు భూభారతి, అకాల వర్షాలు, పంట నష్టం సర్వేలు, మీకు గుర్తుకు రాలేదా, ఆ సమయంలో మీకు అవి కనపడలేదా కేవలం రమణక్కపేట గ్రామసభలకే ఇవన్నీ మీకు అడ్డుగా ఉన్నాయా, వీటన్నిటిని భూచిగా చూపెడుతూ మా గ్రామ ప్రజలకు ఉపాధి లేకుండా చేస్తున్నారు, ఇది ఇలాగే కొనసాగితే కాంగ్రెస్ పార్టీ పైన ఉపాధి పోగొట్టినందుకు గాను మా గ్రామ ప్రజలందరం కలిసి పార్టీలకు అతీతంగా తిరుగుబాటు చేయవలసిన పరిస్థితులు వస్తుందని హెచ్చరిస్తున్నాము, ప్రజల పక్షాన నిలబడిన మమ్మలను విమర్శించే స్థాయి కూడా రమణక్కపేట కాంగ్రెస్ పార్టీ నాయకులకు లేదని గుర్తు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారునికి ఘనంగా జన్మదిన వేడుకలు



ఏటూరునాగారం మే 4.మేజర్ న్యూస్ సూర్య : ఏటూరు నాగారం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రోజున తెలంగాణ ఉద్యమ కారుడైన తుమ్మ మల్లారెడ్డి కి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథు లుగా ములుగు నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి ఉద్యమకా రునికి జన్మదిన శుభాకాంక్షలు తెలపడం మరియు ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు





గారు ఉద్యమ కారునికి ఫోన్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఎండి ఖాజా పాషా, తాడూరి రఘు, దుర్గం రమణయ్య, ఈసం రామ్మూర్తి, మాదరి రామయ్య, కోనేరు నాగేష్, కుమ్మరి చంద్రబాబు, జాడి బోజారావు, జగదీష్, తూరం పద్మ, మెరుగు వెంకటేశ్వర్లు, ఖాత యాదగిరి, నూతి రమేష్, గండేపెల్లి నర్సయ్య, సప్పిడి రాంనర్సయ్య, వావిలాల రాంబాబు, కాళ్ల రామకృష్ణ, చంద లక్ష్మీనారాయణ, తాళ్ల పెల్లి మోహన్, పాలకుర్తి విజయ్, పర్వతాల ఎల్లయ్య, కొండాయి చిన్ని, బట్టు రమేష్, దేపాక శ్రీరామ్, వావిలాల కిషోర్, బాస శరత్, కటుకూరి రాఖీ, రాము, బట్టు రమేష్, తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లుదగ్ధం

వెంకటాపురం నూగూరు మే 4 సూర్య మెజర్ న్యూస్ : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లుదగ్ధం అయిన సంఘటన ఆదివారం ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలో వీరభద్రారం గ్రామంలో చోటు చేసుకుంది. వీరభద్రారం గ్రామంలో సుందరయ్య కాలనీలో మధ్యాహ్నం 3 గంటలకు బంధాలక్ష్మి కి చెందిన ఇళ్లు ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి ఇళ్లు అంత దగ్ధమైందని అన్నారు సంఘటన స్థలానికి గ్రామస్తులు చేరుకుని మంటలను ఆర్పడం జరిగింది. అప్పటికే ఇంట్లోని వస్తువులు, నిత్యావసర వస్తువులు, ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో బాధిత కుటుంబ సభ్యులు బోరున విలపించారు. తమ నివాసం కోల్పోయామని భారీగా ఆస్తి నష్టం జరిగిందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



# నిమిషం ఆలస్యమైనా అనుమతించని అధికారులు



## ఏడుస్తూ వెనక్కి తిరిగిన పలువురు విద్యార్థులు

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, మే 4,మేజర్ న్యూస్ (సూర్య):నీట్ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన నీట్ పరీక్షకు 494 మంది హాజరైనట్టు అధికారులు వెల్లడించారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:30 వరకు విద్యార్థులను అనుమతించారు. ఆ తర్వాత కొన్ని నిమిషాలు ఆలస్యంగా వచ్చిన పలువురు విద్యార్థులను లోనికి అనుమతించకపోవడంతో ఏడుస్తూ వెనక్కి తిరిగారు. మహబూబాబాద్ జిల్లాలో ఆలస్యంగా ఐదుగురు విద్యార్థులు పరీక్షా కేంద్రానికి వచ్చారు. అధికారులు వారిని లోనికి అనుమతించేందుకు ససేమిరా అన్నారు. డీఎస్పీ తిరుపతిరావు ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రం వద్ద గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

పరీక్షా కేంద్రం పరిసరాల్లో 144వ సెక్షన్ విధించారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంతో నీట్ ప్రవేశ పరీక్ష మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రశాంతంగా ముగిసింది.

---

# చిడెం సాయి ప్రకాష్ చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయి

### వెంకటాపురం మండల సి.ఐ బి. కుమార్








వెంకటాపురం నూగూరు, మే 4 సూర్య మేజర్ న్యూస్: చేయూత స్వంచందసేవా సంస్థ వ్యవస్థాపకులు చిడెం సాయి ప్రకాష్ ప్రజలకి చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని ములుగు జిల్లా వెంకటాపురం మండల సిఐ బండారి కుమార్ అన్నారు. ఆదివారం సాయంత్రం వెంకటాపురం మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో సాయి ప్రకాష్ సంతాప సభ నిర్వహించారు. ఈ సభకు పలువురు ప్రముఖులు, రాజకీయ పార్టీలు నేతలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి. ఐ.బి. కుమార్ సంతాప సభలో మాట్లాడుతూ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు, అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొని చిన్న వయసులోనే ప్రజలకు సేవ చేసి అంకితమైనారని సాయి ప్రకాష్ చేసిన సేవలను కొనియాడారు. గత ఏప్రిల్ 15వ తేదీన హనుమకొండకు తన బంధువులను వైద్యశాలకు తీసుకువెళ్లి కార్ తో సహా మిస్ అయిన సాయి ప్రకాష్ దారుణ హత్యకు గురయ్యారు. ఈ సందర్భంగా సంతాప సభ ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు, చిడెం మోహన్ రావు, వెంకటాపురం మండల కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్, సిపిఐ ములుగు జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు, న్యాయవాది చిడెం రవికుమార్, లతో పాటు పలువురు పాల్గొని సంతాప సభలో సాయి ప్రకాష్ చేసిన సేవలను కొనియాడారు.



## శ్వేతార్కలో ఘనంగా వసంతోత్సవాల పూర్ణాహుతి



వరంగల్ లీగల్ మే 4 మేజర్ న్యూస్ (సూర్య): కాజీపేట శ్రీ శ్వేతార్క మూల గణపతి దేవాలయంలో 27వ వసంతోత్సవాల్లో భాగంగా ఆదివారం హవన కార్యక్రమ పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ దేవుని శశాంక్ శర్మ, పిల్లలమర్రి మోహన కృష్ణ శర్మ , శివ శ్రీనివాస్ శర్మ, సహకారంతో ప్రధాన అర్చకులు అయినవోలు సాయి కృష్ణ శర్మ ఆధ్వర్యంలో పూర్ణాహుతి క్రతువును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, దేవాలయ కార్యకర్తలు పలువురు భక్తులు పూర్ణాహుతి కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. వసంతోత్సవాల నిర్వహణలో ఐదు రోజులుగా కలశంలో స్థాపన చేసిన జలాలను దేవాలయ అర్చకులు భక్తులందరికీ అవభ్రుత స్నానం చేయించారు. ఈ క్రమంలో భక్తులందరికీ వేద పండితులు వేద మహా ఆశీర్వచనం చేశారు. అనంతరం దేవాలయ నిర్వాహకులు భక్తులకు అన్నపూర్ణ భవన్లో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యకర్తలు, భక్తులు అరుణాదేవి, ఉమారాణి, సుప్రజ, సీనమ్మ, రజిత, కవిత, విజయ, కోటి, నాగమణి ,నాగలక్ష్మి, గౌతమ్, శ్రీకర్ ,పాక పవన్, పాక యశ్వంత్, సాత్విక్ ,అశోక్, తుమ్మ శ్రీనివాస్ ,వరికోల్ వీరేందర్ ,సాయిరాం, వెంకట సాయి తేజ, దేవులపల్లి సదానందం, మైలవరపు శివరాం, భాగ్యలక్ష్మి ,అనురాధ తదితరులు పాల్గొన్నారు

## వేసవి ఉచిత శిక్షణ శిబిరం విద్యార్థులకు సద్వినియోగం చేసుకోవాలి

### మండల విద్యాశాఖ అధికారి మామునూరి శ్రీధర్



వర్ధన్నపేట మేజర్ న్యూస్ సూర్య మే 4: ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే ఉచిత శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వర్ధన్నపేట మండల విద్యా శాఖ అధికారి మామునూరి శ్రీధర్ అన్నారు. ఆది వారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ విద్యా ర్థుల సమయంను వృధా చేయకుండా నైపుణ్యాలను పెంపొందించేం దుకు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే ఆరు నుండి పదవ తరగతి చదివే విద్యార్థులకు ఈనెల 5వ తేదీ నుండి 20వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. శిక్షణ అంశాలు డ్రాయింగ్, డాన్స్, స్పోర్ట్స్, కరాటే, క్రాఫ్ట్, గేమ్స్, స్పోకెన్ ఇంగ్లీష్, అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మండలంలోని వర్ధన్నపేట వర్ధన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇల్లందు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కట్రేయాలా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ శిబిరాలకు వచ్చే విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వమే స్నాక్స్ అందించడం జరుగుతుందన్నారు.

# ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు

### ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జీఎస్సార్

రేగొండ, మే 04, మేజర్ న్యూస్ (సూర్య) : భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండలం రేపాకపల్లి గ్రామ శివారు నర్సింగాపూర్ గ్రామంలో సగర సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సగర భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. ఎమ్మెల్యేకు సగర కులస్తులు, గ్రామస్తులు శాలువాలు కప్పి స్వాగతం పలికారు. ముందుగా భగీరథ మహర్షి విగ్రహానికి ఎమ్మెల్యే పాలాభిషేకం చేసి, పూలమాల వేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... భగీరథ మహర్షి ఎంతో పట్టుదల కలిగిన వ్యక్తి అని, ఎన్ని అవాంతరాలు ఎదురైనా





దివి నుండి భువికి గంగను లోక కల్యాణం కోసం తెచ్చిన మహానుభావుడన్నారు. ఆయన పట్టుదలకు మారు పేరని, అందుకే ఆయన అపర భగీరథుడుగా పేరొందారన్నారు. మరుగునపడిన చరిత్రకారుల జీవితాలను, మహనీయుల గొప్పతనాన్ని వెలికితీసి వారి ఆదర్శ భావాలకు అనుగుణంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అధికారికంగా ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం గొప్ప విషయమున్నారు. సగర కులస్తుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట సగర కులస్తులు,మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు పున్నం రవి, పట్టేం శంకర్, వీరబ్రహ్మం, రాజబాబు పలువురు నాయకులు,గ్రామస్తులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ ఆలింగనాలతో మొదలైన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నెల్లికుదురు మే 4 మేజర్ న్యూస్(సూర్య) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2008-9లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం మండల కేంద్రంలోని అమూల్య గార్డెన్ లో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆనాటి ఉపాధ్యాయులు చెన్నోజ్ జీవన్ కుమార్, పూసల సోమయ్య, సిబ్బం





ది లను షాలువాలతో సత్కరించి, మెమొంటోలు అందించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూపాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకారాన్ని అందించాలని,ప్రతి ఒక్కరు మంచి జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు అలనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. విద్యార్థిని, విద్యార్థులు ఆనాటి కొన్ని సంఘటనలను గుర్తుచేసుకుని, వేదికపై అలనాటి తమ అనుభవాలను పంచుకున్నారు. పాటలు, సంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. భోజన అనంతరం సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


# సామాజిక సేవలో లక్ష్మీగణపతి సహకార పరపతి సంఘం

### బాటసారులకు గత 12 సంవత్సరాలుగా చల్లని నీరు 4 సంవత్సరాలుగా మజ్జిగ పంపిణీ

వరంగల్ మే 04 మేజర్ న్యూస్ (సూర్య): భగభగ మండే ఎండల్లో బాటసారుల దాహార్తి తీర్చడానికి చల్లని నీటితో పాటు మజ్జిగ అందిస్తూ దాతల సహాయంతో లక్ష్మీగణపతి సహకార పరపతి సంఘం సేవా కార్యక్రమాలు చేపడుతుంది. గత 12 సంవత్సరాలుగా కాశీబుగ్గలో లక్ష్మీ గణపతి సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి బాటసారులకు చల్లని నీరు అందివ్వడం తో పాటు,గత 4 సంవత్సరాలుగా రామనాథం రఘు కిషోర్ - ప్రవీణ' దంపతులు(ఎన్ఆర్ఐ) ప్రతిరోజు 30 క్యాన్లు (600 లీటర్లు )మినరల్ వాటర్ సంఘానికి అందిస్తున్నట్లు తెలిపారు. సేవా కార్యక్రమాలు చూసి మజ్జిగను ఇవ్వడానికి దాతలు ముందుకు వస్తున్నట్లు తెలిపారు.ప్రతీ రోజు 20 కిలోల పెరుగుతో మజ్జిగ కమిటీ సభ్యులందరూ కలిసి దాతల పేరు మీద బాటసారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో అధ్యక్షులు వంగరి రాంప్రసాద్,కోశాధికారి దుస్స కృష్ణ,ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు,దాసి శివకృష్ణ,సహాయ కార్యదర్శులు పసునూటి శ్రీకాంత్,మండల చంద్రశేఖర్, క్యాతం శ్రీనివాస్, సహాయ



కోశాధికారులు మామిడాల,సతీష్,ఆర్గనైజర్ బండారి లక్ష్మణ్,గౌరవ సలహాదారులు గాదె జగన్,వంగరి రవి,బండారి రాజేశ్వరరావు,కార్యవర్గ సభ్యులు కానుగంటి పవన్ కుమార్,గాజుల రాజేష్,ములుక సురేష్, క్యాతం రవీందర్,సభ్యులు పాల్గొన్నారు.



# కిరాణా వర్తక సంఘం జిల్లా అధ్యక్షుడిగా సోమరత్న శేఖర్

**మొదటిసారిగా కిరాణా వర్తక సంఘం ఎన్నిక కు పోలీస్ బందోబస్తు ఏర్పాటు**

**యువతకి మొదట ప్రాధాన్యత ఉంటుంది: అధ్యక్షులు రత్న శేఖర్**


**కిరాణా వర్తక సంఘం మరింత అభివృద్ధి చేస్తా**

**నేను విజయం సాధించడానికి కారణమైన వర్తక సంఘం సభ్యులకి పేరుపేరునా ధన్యవాదాలు**

మహబూబాబాద్ టౌన్, మే 04, మేజర్ న్యూస్(సూర్య): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక కిరాణా వర్తక సంఘ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రశాంతంగా జరిగాయి. ఈ ఎన్నికలలో అధ్యక్షుడి పోటీ బరిలో కర్లపాటి హరి, కేశ జనార్ధన్, పెనుగొండ సదాశివుడు, లింకలపల్లి శ్రీనివాస్ , సోమరత్నశేఖర్ లు పోటీలో పాల్గొన్నారు మొత్తం 150 ఓట్లకు పోలు కాగా 54 ఓట్లు తో అఖండ మెజార్టీతో అధ్యక్ష పదవి కైవసం చేసుకున్న సోమరత్న శేఖర్ మరియు .ప్రధాన కార్యదర్శి కొండ్లి బద్రీనాథ్ గెలుపొందడం జరిగింది. కోశాధికారి పదవికి గుండా మధుకర్ రెడ్డి ఘన విజయం సాధించినట్లు ఎన్నికల కమిటీ సభ్యులు శ్రీరంగం నరసింహారావు,ఓలం విద్యాసాగర్ కర్లపాటి నారాయణమూర్తి కొండ్లె సూరయ్య, సురేష్ లు తెలిపారు. వారు ఎన్నికల నిర్వాహకులుగా వ్యవహరించగా తుది ఫలితాలను వెల్లడించి మాట్లాడుతూ కిరాణా వర్తక సంఘ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ సంఘ అభివృద్ధికి పాటుపడి ఐక్యతకు కృషి చేయాలని హితువు పలికారు నూతనంగా అధ్యక్షుడిగా గెలుపొందిన సోమ రత్న శేఖర్, ప్రధాన కార్యదర్శిగా కొండ్ల బద్రీనాథ్ కోశాధికారిగా మధుకర్ రెడ్డి మాట్లాడుతూ మా మీద నమ్మకంతో ఎన్నికల్లో అమూల్యమైన ఓటు వేసి గెలిపించినందుకు వెల్ఫేర్ అసోసియేషన్ బలోపేతానికి కృషి







చేస్తామని ఎటువంటి లోపాలు జరగకుండా క్రమశిక్షణతో అందరి నిర్ణయాలకు కట్టుబడుతూ అసోసియేషన్ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు ఎన్నికలలో విజేతలు అయిన నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కోశాధికారులను వర్తక సంఘ ఎన్నికల కమిటీ మరియు పలువురు వ్యాపారవేత్తలు శ్రేయోభిలాషులు స్నేహితులు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి శాలువతో సత్కారం చేసి శుభాకాంక్షలు తెలిపారు.







# ప్రతి సమస్యలో మీకు తోడుంటా









**- గుండేడు గ్రామంలో నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి**

**- శివాలయంలో ప్రత్యేక పూజలు**

**- శివాలయం, మడేలయ, పోచమ్మ దేవాలయాల నిర్మాణం కోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసింది.**

**- మీరు ఓట్లేస్తేనే గెలిచిన**

**- మీకు ఎప్పుడు రుణపడి ఉంటా**

**- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి**

కమలాపూర్ మే 04 మేజర్ న్యూస్ సూర్య :– హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని గుండేడు గ్రామంలో నాలుగు రోజులుగా విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు అంగరంగ వైభవంగా ఆ గ్రామస్తులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి గుండెడు గ్రామంలో పర్యటించారు. గుండేడు గ్రామస్తులు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. మొదటగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుండెడు గ్రామ ప్రజలకు ఎప్పుడు తోడుంటానని అన్నారు. గత వారం రోజుల క్రితం గ్రామం నుండి పార్టీలకు అతీతంగా తన దగ్గరకు వచ్చి దేవాలయాల విగ్రహ ప్రతిష్టాపన కు సహకారం అందించాలని కోరారని తప్పకుండా సాయం అందిస్తానని మాట ఇచ్చానని ఇచ్చినట్లుగానే 10 లక్షల రూపాయల చెక్కును అందజేస్తున్నట్లు తెలిపారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేసిందని గుర్తు చేశారు. మీరు ఓట్లెస్తేనే గెలిచిన మీకు అవసరం ఉన్నా రండి మీకు నేను తొడుంటాను అని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మణ్ రావు, మాజీ ఎంపిటిసి సుజాత,మాజీ సర్పంచ్ లక్ష్మణ్ రావు, పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ తక్కలపల్లి సత్యనారాయణ రావు గుండేడు గ్రామస్తులు పాల్గొన్నారు.

## దళిత యువకుడి పై దాడి హేయమైన చర్య

**అంబేద్కర్ సంఘం మండల కన్వీనర్ ఎల్తూరి ప్రేమ్ రాజ్**



భీమదేవరపల్లి, మే 04(మేజర్ న్యూస్ సూర్య):సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వేచరేణి గ్రామానికి చెందిన ఊపిరి అజయ్ కుమార్ అనే దళిత యువకుడి పై దాడికి పాల్పడి, ఆపై అర్ధ నగ్నంగా ఊరేగించిన దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని అంబేద్కర్ సంఘం భీమదేవరపల్లి మండల కన్వీనర్ ఎల్తూరి ప్రేమ్ రాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సభ్య సమాజం తలదించుకునేలా మతిస్థిమితం లేని దళిత యువకుడిని విపరీతంగా కర్రలతో కొడుతూ నగ్నంగా ఊరేగిస్తూ రాళ్లతో కాళ్లు, చేతులు కట్టేసి గుడి గోడకు నిలబెట్టి విపరీతంగా దాడి చేసిన దుండగులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. దళిత యువకుడిపై దాడి హేయమైన చర్యగా అభివర్ణిస్తూ, దుండగలను తక్షణమే అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసు నమోదు చేసి శిక్షించాలని కోరారు. మతం పేరుతో దళితుల మీద దాడి చేయడం అమానుషమన్నారు. ఈ చర్యకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని, లేని యెడల దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## మోడల్ స్కూల్ లో "ఇంటర్" ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



భీమదేవరపల్లి, మే 04(మేజర్ న్యూస్ సూర్య):భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ మోడల్ స్కూల్ లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రెహమాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపిసీ, సీఈసీ కోర్సుల్లో 40 సీట్ల చొప్పున అందుబాటులో ఉన్నాయన్నారు. ఈనెల 5 నుంచి 20 వరకు ఆన్ లైన్ (telanganams.cgg.gov.in)లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండలంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నేడు ధర్మారం చౌటుపర్తి లో భూభారతి రెవెన్యూ గ్రామ సభలు...



నడికుడ మే 4 మేజర్ న్యూస్ సూర్య:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భూభారతి ఆర్ వో ఆర్ చట్టం పైలెట్ ప్రాజెక్టు కింద నడి కూడ మండలం ఎంపిక చేయగాసోమవారం ధర్మారం. చౌటుపర్తి . గ్రామాలలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు గ్రామాలలో భూభారతి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని భూ సమస్యలు ఉన్న రెండు గ్రామాల ప్రజలు దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని నడికుడ తహసిల్దార్ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ గ్రామాలలో భూ సమస్యలు భూతగాదాలు మరియు ఇతర సమస్యలు ఉన్నవారు రెవిన్యూ గ్రామసభలో దరఖాస్తు చేసుకున్నచో వారి సమస్యలను సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు మరియు గ్రామస్తులు అన్నదాతలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు

## ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం



భీమదేవరపల్లి, మే 04(మేజర్ న్యూస్ సూర్య):కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా బీసీ కుల గణన నిర్వహించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని స్వాగతిస్తూ ఆదివారం మండలంలోని ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తాలో బిజెపి మండలాధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ముఖ్యఅతిథిగా సిద్దిపేట జిల్లా కౌన్సిల్ మెంబర్ పైడిపల్లి పృథ్వీరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని వర్గాల పట్ల సమాన దృష్టి కోణం కలిగిన నాయకుడు కేవలం నరేంద్ర మోడీ అని, ప్రపంచ దేశాలకు మన ప్రధానమంత్రి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఊసకోయిల కిషన్, దొంగల వేణు, సిద్దమల్ల రమేష్, గంప సురేష్, కంకల సదానందం, అంబిర్ కవిత, ములుగు సంపత్, సాయి, రాణా, ప్రతాప్, వీరన్న, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్వేతార్క దేవాలయంలో ఘనంగా వసంతోత్సవాల పూర్ణాహుతి



కాజీపేట మే 04 మేజర్ న్యూస్ (సూర్య) కాజీపేట లోని స్వయంభూ శ్రీ శ్వేతార్క మూల గణపతి దేవాలయ దివ్య క్షేత్రంలో వసంతోత్సవాల హవన కార్యక్రమాలలో భాగంగా పూర్ణాహుతి నిర్వహించడం జరిగింది బ్రహ్మశ్రీ దేవుని శశాంక్ శర్మ, పిల్లలమర్రి మోహన కృష్ణ శర్మ, శివ శ్రీనివాస్ శర్మ మరియు అయినవోలు సాయి కృష్ణ శర్మ, ఆధ్వర్యంలో అర్చకుల నడుమ ఈ యొక్క పూర్ణాహుతి క్రతువును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ మరియు దేవాలయ కార్యకర్తలు పలువురు భక్తులు పాల్గొని పునీతులయ్యారు మరియు ఐదు రోజులపాటుగా కలశలో స్థాపన చేసినటువంటి జలాలను భక్తులందరికీ అవభ్రుత స్నానం చేయించారు.
భక్తులందరికీ వేద మహా ఆశీర్వచనం వేద పండితులు అందించారు. అనంతరం భక్తులందరికీ అన్నపూర్ణ భవన్లో అన్నదానం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యకర్తలు అరుణాదేవి, ఉమారాణి, సుప్రజ, సీనమ్మ, రజిత, కవిత, విజయ, కోటి, నాగమణి, నాగలక్ష్మి, గౌతమ్, శ్రీకర్, పాక పవన్, పాక యశ్వంత్, పాక సాత్విక్, పాక అశోక్, తుమ్మ శ్రీనివాస్, వరికోల్ వీరేందర్, సాయిరాం, వెంకట సాయి తేజ, దేవులపల్లి సదానందం, మైలవరపు శివరాం, భాగ్యలక్ష్మి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి...!



**-ఉపాధిలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి**

**-ఉపాధి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి**

**-తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య**

కురవి, మే 4మేజర్ న్యూస్ (సూర్య ):జాతీయ గ్రామీణ ఉపాధి పనిలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం 26,000 ఇవ్వాలని గత నాలుగు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం సంగం జిల్లా అధ్యక్షులు మంద రాజన్న అధ్యక్షతన సీరోలు మండలం మన్నెగూడెం గ్రామంలో జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జి నాగయ్య మాట్లాడుతూ. ..ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడం కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని పేదలను మరింత పేదలుగా దిగజార్చే కుట్రలు చేస్తుందని నాగయ్య మండిపడ్డారు తెలంగాణ రాష్ట్రంలో ఉపాధి పని దినాలు 8 కోట్ల నుండి ఆరున్నర కోట్ల పని దినాలకు తగ్గించడాన్ని వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధపడాలని తెలంగాణ రాష్ట్రానికి జరిగిన అన్యాయం పై బిజెపి ఎంపీలు మంత్రులు నోరు విప్పాలని డిమాండ్ చేశారు కొత్తగా జాబ్ కార్డు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం 12000 ఇవ్వాలని పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు మే 5 నుండి మే 20 వరకు 15 రోజులపాటు దేశవ్యాప్తంగా ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రచారం చేస్తున్నట్టు నాగయ్య వెల్లడించారు ఈ సమావేశంలో సంఘం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య సంగం జిల్లా ఉపాధ్యక్షులు ఎండి యాకూబ్ బాణాల రాజన్న జిల్లా సహాయ కార్యదర్శి వంగూరు వెంకటేశ్వర్లు జిల్లా నాయకులు గుడిశాల వెంకన్న స్వామి బల్లెం ఆనందరావు గొల్లపల్లి కృష్ణ లింగోజ్ బ్రహ్మాచారి తేలూరి వీరభద్రం తగరం తిరుపతి పూర్ణం కొమ్మినేని రామేశ్వరం తదితరులు పాల్గొన్నారు.

# పదిలో ఉత్తమ ప్రతిభ విద్యార్థికి సత్కారం

కురవి,మే 4మేజర్ న్యూస్ (సూర్య ):మండల కేంద్రంలోని సిద్ధార్థ హై స్కూల్ లో 2024 25 అకాడమీ ఇయర్ ఎస్ఎస్సి ఫలితాలలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగింది. పాఠశాల టాపర్ గా దడిగల. సాయివీర మణికంఠ 600కు 538 మార్కులు రావడం జరిగింది. దీనికి గాను పాఠశాల ప్రధానోపాధ్యాయులు...అల్వాల కార్తీక్ మరియు పాఠశాల కరస్పాండెంట్ అల్వాల ఉమారాణి మరియు ఉపాధ్యాయ బృందం బండి వెంకన్న,బోడ వెంకన్న లు విద్యార్థిని ఘనంగా సత్కరించి అభినందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో విద్యార్థి తండ్రి దడిగల.రవి పాల్గొన్నారు



## మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి రెడ్యానాయక్



కురవి, మే 4మేజర్ న్యూస్ (సూర్య ):మండలం లోని పోలంపల్లీ తండా గ్రామం పరిధిలోని బంధంకొమ్ము తండా లో బీ అర్ ఎస్ యూత్ నాయకులు మూడ్ భాస్కర్ తల్లి మూడ్ రుక్కమ్మ ఆదివారం మరణించినారు వారి భౌతికాయానికి పూలమాలవేసి మాజీ మంత్రి డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డి ఎస్ రెడ్యానాయక్ నివాళులర్పిచారు.అయన వెంట తెలంగాణ ఉద్యమ నాయకులు ,బీఅర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకులు గుగులోతు రవి నాయక్,మాజీ సర్పంచ్ మూడ్ నరేష్,నాయకులు లక్ష్మణ్,జగదీష్, లల్సింఘ్, స్థానిక నాయకులు ఉన్నారు.

**-రేకుల తండా(కె) లో**

మండలం లోని రేకుల తండా (కె)లో గుగులో త్ నెహ్రూ గుండెపోటుతో మరణించినారు వారి భౌతికాయానికి పూలమాలవేసి నివాళులర్పించిన మాజీ మంత్రి డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే శ్రీ డి ఎస్ రెడ్యానాయక్ అయినా వెంట తెలంగాణ ఉద్యమ నాయకులు ,బీ అర్ ఎస్ యూత్ రాష్ట్ర నాయకులు గుగులోతు రవి నాయక్,మాజీ సర్పంచ్ వినోద్,మాజీ ఎంపీటీసీ నరేష్,దయాకర్,సుధాకర్,
బాలు,వెంకన్న స్థానిక నాయకులు ఉన్నారు.

### సిపిఐ ఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో ఏసీ రెడ్డి కాలనిలో మే డే ఉత్సవాలు



పాలకుర్తి మే 04 మేజర్ న్యూస్ (సూర్య)పాలకుర్తి మండల కేంద్రంలో ని ఏసీ రెడ్డి కాలనిలో ఆదివారం మేడే ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జీడీ సోమయ్య ముఖ్య అతిథి గా హాజరు అవ్వగా కాలనీ అధ్యక్షురాలు షేరు మల్లికాంబ జెండా ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జీడి సోమయ్య మాట్లాడుతూ మేడే ఉత్సవాలు నిర్వహించుకోవడం అత్యంత అభినందనీయమని కాలనీవాసులను అభినందించారు. ప్రపంచ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు ,శ్రమజీవులు కోరికలు ఇప్పటి పాలకులు కాలరాయకుండా ఉండాలంటే నిత్యం సంఘటితంగా ఉండి పోరాడాలన్నారు. ఎ సి రెడ్డి కాలనీలో పేరుకుపోయిన సమస్యలను పాలకులు పట్టించుకోవడంలేదని అనేక ఏళ్లుగా అందులో ఇళ్ల పట్టాలు లేకుండా పక్క గృహాలు లేకుండా అరకొర సౌకర్యాలతో బ్రతుకులు వెల్లదీస్తున్నారని సోమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు ఎ సి రెడ్డి కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించి అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టించి ఇవ్వాలన్నారు. డ్రైనేజీలు శుద్ధి చేయకుండా అనేక ఏళ్లుగా గ్రామపంచాయతీ అధికారులు,పాలకులు పట్టించుకోవడంలేదని ఆయన తీవ్రంగా దుయ్యబడ్డారు. కాలనీవాసులు ఐక్యంగా ఉండి కాలనీ హక్కుల కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో మామిళ్ళ జయమ్మ. మామిళ్ళ రమ. దేశవైన రమ. సుజాత. మామిళ్ళ విజయ. సుభద్ర. సూరమ్మ .మామిండ్ల లక్ష్మి .మండల నాయకులు గ్యార రాజు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే



కురవి, మే 4 మేజర్ న్యూస్ (సూర్య ):సిరోల్ మండలంలోని ఉప్పరగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ సీనియర్ నాయకులు అక్కేనపెల్లి ఉప్పలయ్య గత కొన్ని రోజుల క్రితం ఖమ్మం ఇండోసు హాస్పిటల్ లో మోకాళ్ళ ఆఫరేషన్ చేపించుకోవడం జరిగింది. విషయం తెలుసుకున్న డోర్నకల్ నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్ ఆదివారం ఉప్పరగూడెం గ్రామంలో అతని ఇంటికి వద్దకు వెళ్లి పరామర్శించంచారు.ఆయన వెంట మార్కెట్ ఛైర్మెన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్ మండల యూత్ ఉపాధ్యక్షులు మల్లికంటి సురేష్ గారు ,తోట మధు, కన్నం రాంబాబు, బొజ్జ రవి, ఐలీ వెంకన్న, గంట మహేష్, నాగటి విజయ్, తోట విజయ్, గంట విష్ణు, గంట హరీష్ గ్రామస్థాయి కాంగ్రెస్ నాయకులు,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**-కందికొండ లో**

మండలంలోని కందికొండ గ్రామానికి చెందిన అంబడిపుడి వీరన్న(ప్రసాద్) తండ్రి ఉప్పలయ్య ఏప్రియల్ 28 తారీఖున హైదరబాద్ లో ప్రైవేటు బస్ డికొనడంతో మృత్యువాత పడ్డారు ఆ నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎంఎల్ఏ డా, రామచంద్రనాయక్ పరామర్శించి మృతుని భార్య,పిల్లల్ని కలిసి దైర్యం చెప్పి, ఓదర్చారు,పిల్లల్తో మాట్లాడుతూ బాగా చదువుకోవలన్నారు.అంతేకాకుండా ప్రభుత్వము తరఫున వారి కుటుబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు, కందికొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, గ్రామస్తులు ఎంఎల్ఏ కు కృతగ్నతలు తెలిపారు.-కురవి మండల సుధనపల్లి గ్రామంలో నీలం వెంకన్న తండ్రి చంద్రయ్య ఇటీవలే అనారోగ్యంతో చనిపోయాడు వారి కుటుంబాని పరామర్శించి వారికి కుటుంబాన్నికి ప్రగాఢ సానుభూతి తెలిపిన డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్, జె రాంచంద్రునాయక్ వారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్య వైశ్యుల ఐక్యతను చాటుదాం



### జనగామ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు గంగిశెట్టి ప్రమోద్ కుమార్ ఘనంగా పాలకుర్తి మండల ఆర్యవైశ్య సంఘ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం

పాలకుర్తి మే 04 మేజర్ న్యూస్ (సూర్య) ఆర్య వైశ్యులు సంఘటితమై ముందుకు నడవాలని అప్పుడే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బషారత్ గార్డెన్ లో చీదర జగదీష్ అధ్యక్షతన ఆర్యవైశ్య మండల శాఖ నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రమోద్ కుమార్ ముందుగా ఆర్యవైశ్య సంఘం మండల కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు రాజకీయాలలో ఎదిగినప్పుడే సమాజానికి మీరు జరుగుతుందన్నారు. ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమంలో ముందుంటారన్నారు. నూతన కమిటీ చురుగ్గా పనిచేస్తూ ప్రగతికి బాటలు వెయ్యాలన్నారు. ఆర్యవైశ్యుల ఐక్యతతోనే ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధించామని అన్నారు.పేద ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ రుణాల కోసం తనవంతు తోడ్పాటు అందిస్తానన్నారు.అనంతరం విశిష్ట అతిథిగా విచ్చేసిన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మాశెట్టి ఉపేందర్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అందరూ ఐక్యంగా ఉండాలన్నారు.సమాజ అభ్యున్నతికి, పేదల సంక్షేమానికి అందరూ కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ఎప్పుడూ ముందుంటారని అన్నారు.

అనంతరం నూతన అధ్యక్షుడిగా చారగొండ్ల ప్రసాద్ ప్రధాన కార్యదర్శి గా తమ్మి రాంబాబు, కోశాధికారి గా వనమాల శ్రీనివాస్ అదనపు కార్యదర్శిగా పబ్బ సంతోష్ మరియు మండల ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలిగా బోనగిరి రమాదేవి ప్రధాన కార్యదర్శిగా బుగ్గారపు దివ్య జ్యోతి, కోశాధికారిగా నాగమళ్ళ వనిత మరియు యువజన ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా చార గొండ్ల శివ ప్రధాన కార్యదర్శిగా ఇమ్మడి అఖిల్, కోశాధికారిగా పట్టురి రాకేష్ లు మండల నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గన్ను నరసింహులు, రీజియన్ చైర్మన్లు పడకండి రవీందర్, సరాబు ఆంజనేయులు, మహిళా విభాగం అధ్యక్షురాలు మాదంశెట్టి వరూధిని,జిల్లా సేవాదళ్ విభాగం అధ్యక్షుడు నాగమళ్ళ సోమేశ్వర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గజ్జి సంతోష్ కుమార్, స్టేట్ కౌన్సిల్ మెంబర్లు చార గుండ్ల సదానందం, బోనగిరి విద్యాసాగర్, పాలకుర్తి పట్టణ అధ్యక్షుడు రాపాక రఘు,రాపాక సుధాకర్, రాపాక సత్యనారాయణ, బజ్జురి వేణుగోపాల్, ఇమ్మడి దామోదర్, వల్లబు లక్ష్మి నారాయణ, గంగిశెట్టి అనుజ, తమ్మి స్రవంతి, నంగునూరు మహేష్, రాపాక అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు.



హసన్‌పర్తి, మే 4, మేజర్ న్యూస్ (సూర్య).హసన్‌పర్తి మండల పరిధి లోని మడిపల్లి గ్రామానికి చెందిన చింత కరుణాకర్ కుమారుడు చింత యశ్వంత్ గత 2 నెల్ల క్రితం ప్రమాదవశాత్తు వేడి నీళ్లు పడి ఆస్పత్రి లో చికిత్స పొందుతూ నిన్న రాత్రి మృతి చెందాడు. ఆదివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశాడు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చాడు. ఎమ్మెల్యే వెంట ఆత్మకూరు ఏఎంసి వైస్ చైర్మన్ తంగెళ్ళపల్లి తిరుపతి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ చిర్ర సుమలత-విజయ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మాచర్ల మహేందర్, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి



పాలకుర్తి మే 04 మేజర్ న్యూస్ (సూర్య)పాలకుర్తి మండలం విస్నూర్ గ్రామ బి. ఆర్. యస్ మండల నాయకులు సిరిగనేని సోమేశ్వరరావు-సునీత ల ద్వితీయ పుత్రుడు నవనీత్ రావు,పూజ ల వివాహంపాలకుర్తి మండల కేంద్రంలోని బృందావనం గార్డెన్ లో జరగగా నూతన వధూవరులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆశీర్వదించారు.ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ జడ్పీటీసీ పూస్కూరి శ్రీనివాస్ రావు, మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, పాలకుర్తి సొసైటీ మాజీ చైర్మన్ అడ్డూరి మాధవరావు,మహేందర్ నాయక్, మల్లేష్ భూపాల్ రావు మరియు గ్రామ నాయకులు ఉన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం




పాలకుర్తి మే 04 మేజర్ న్యూస్ (సూర్య) అపూర్వంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని పూర్వ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించుకున్నారు. పాలకుర్తి ఉన్నత పాఠశాలలో 2004-05 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థిని విద్యార్థులు 20సంవత్సరాల తర్వాత సమ్మేళనం నిర్వహించుకోవడం పట్ల పూర్వ విద్యార్థులు ఆనంద ఉత్సవాలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గంట రవీందర్, పోతుగంటి నర్సయ్య,పూర్వ ఉపాధ్యాయులు, కిషనరావు హెడ్ మాస్టర్, మహేందర్ రెడ్డి, సంధ్యారాణి, దొంగారి సోమయ్య,, రాధలక్ష్మి, వేంకటేశ్వర రావు,రాజేంద్రప్రసాద్, సలేంద్ర సోమయ్య, పి మహేందర్ రెడ్డి,బలమల్లు, నరబోయిన యకాయ,పూర్వ విద్యార్థులు, రాపాక అనిల్, జీడి నరేందర్,గాదేపాక కిరణ్, సంగి నరేష్,గజేందర్, ముస్కు నిషంత్, దివ్య, నరేష్,రఘు, సరిత,స్వప్న,కోమల,సుప్రియస్వప్న లు పాల్గొన్నారు.

# గ్రామస్తుల ఐక్యతకు ప్రతిరూపాలే గ్రామ దేవతల పండగలు





## అంగరంగ వైభవంగా గంగాదేవి కాటమరాజు ఉత్సవాలు ముఖ్యఅతిథిగా పాల్గొన్న నియోజకవర్గ ఇన్చార్జ్ ఝాన్సీ రెడ్డి

దేవరుప్పుల మే 04 మేజర్ న్యూస్ (సూర్య):దేవరుప్పుల మండలంలోని కడవెండి గ్రామంలో ఆదివారం గ్రామదేవతలు గంగాదేవి, కాటమరాజు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలలో కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మంద గంప ఎత్తుకొని, పాడిపంటలతో చల్లగా చూడాలని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి కాటమయ్య గంగాదేవి ఆలయాలలో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పుల దరువులు పోతురాజుల విన్యాసాలు సాంస్కృతిక కార్యక్రమాలు యువకుల ఆటపాటలతో ఉత్సాహభరితంగా సాంప్రదాయపూరకంగా ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతలు సంరక్షకులుగా, రక్షకులుగా సామూహిక శ్రేయస్సును అందించేవారుగా చూస్తారని, గ్రామ ప్రజల ఐక్యతకు ప్రతిరూపాలే గ్రామ దేవతల పండగలని, గ్రామాభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని ఝాన్సీ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు మండల యూత్ అధ్యక్షులు పులిగిల్ల వెంకన్న బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు కాడబోయిన గణేష్ ఇనుముల నాగరాజు భూక్య సజ్జన్ నాయక్ ఎండి రసూల్ సీనియర్ నాయకులు రామచంద్రు నాయక్ తోటకూరి పాండుకృష్ణ ఎండి జాకీర్ కాడబోయిన వెంకన్న బోనగిరి యాకస్వామి రెడ్డిరాజుల రమేష్ ఓడపల్లి రవి దావెర అనిల్ రెడ్డిరాజుల రమేష్ జక్కుల గంగరాజు గుగులోతు లొడంగి వెంకన్న రాజేందర్ రాంబాబు పెద్ది శ్రీను పోతిరెడ్డి లీనారెడ్డి ఎన్.ఎస్.యూ.ఐ మండల అధ్యక్షుడు కొంగరి ఉమేష్ మండల ముఖ్య నాయకులు సోషల్ మీడియా కోఆర్డినేటర్లు మాసంపల్లి సాత్విక్ గనుపాక ప్రదీప్ లోడింగి అశోక్ గ్రామ కార్యకర్తలు మహిళలు యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటాపురంలో నేడు వ్యవసాయ శాస్త్రవేత్తలతో అవగాహన



పరకాల రూరల్ మే 4 మేజర్ న్యూస్ సూర్య: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తల తో రైతులకు అవగాహన కార్యక్రమం పరకాల మండలం వెంకటాపురం గ్రామంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 8 గంటలకు వెంకటాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల యందు రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్త ల కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. అని అన్నారు వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొని రైతులు పండించవలసిన పంటలపై పంట దిగుబడులపై ఇతర పంటల సాగుపై వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇచ్చే తగు సూచనలు గ్రామానికి చెందిన రైతు సోదరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమానికి రైతులు హాజరు కావడం వలన రైతులకు పంటల దిగుబడి పై అవగాహన కలుగుతుందని వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ తెలియజేశారు.

### -డి ఎన్ బి కార్డియాలజీ ఉత్తీర్ణత సాధించిన డాక్టర్ కార్తీక్ నాయక్.
### -తండ్రిని ఆదర్శం గా తీసుకుని వైద్య వృత్తి లోకి.
### -వెల్లువెత్తుతున్న హర్షాతిరేఖాలు. అభినందనలు



కురవి, మే 4,మేజర్ న్యూస్ (సూర్య ):ఉమ్మడి కురవి సీరోల్ మండలం భీల్యానాయక్ తండా వాసి డాక్టర్ నెహ్రూ-అనిత దంపతుల కుమారుడుడాక్టర్ కార్తీక్ నాయక్ డి ఎన్ బి కార్డియాలజీ (గుండె కోర్సును) ఉత్తీర్ణత సాధించారు. సీరోలు మండలంలోని బీల్యానాయక్ తండా నుండి తన తండ్రి డాక్టర్ నెహ్రూ మొదట ఎం బి బి ఎస్ , ఎం డి డి సి హెచ్ చదివి మహబూబాబాద్ ప్రభుత్వఆసుపత్రికి మొదటి సూపరింటెండెంట్ గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రముఖ వైద్యులుగా, ఐయంఏ అధ్యక్షులుగా ఉన్నారు.డాక్టర్ నెహ్రూ కుమారుడైన బాణోత్ కార్తీక్ నాయక్ మొదటి నుండి తండ్రినే ఆదర్శంగా తీసుకుని పట్టుదలతో చదివి ఎం బి బి ఎస్ ఎం డి పూర్తి చేసారు.అంతటితో ఆగకుండా ఇంకా చదవాలనే తపనతో తిరిగి 3 సంవత్సరాల గుండె స్పెషలిస్ట్ కోర్సు కొరకు ప్రవేశ పరీక్ష రాసి సీటు సాదించారు.3 సంవత్సరాలు కుటుంబానికి దూరంగా ఉంటూ, కష్టపడి చదివి మొదటి అటెంప్ట్ లోనే డి ఎన్ బి కార్డియాలజీ పరీక్షలో ఉత్తీర్ణులై తన ప్రతిభను చాటుకున్నారు.బీల్యానాయక్ తండా నుండి డాక్టర్ కార్తీక్ మొట్టమొదటి గుండెవ్యాధుల సూపర్ స్పెషలిష్ట్ డాక్టర్ గా ఎదిగి నందుకు ఆ తండా ప్రజలతోపాటు, మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా వైద్యులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. మహబూబాబాద్ ప్రాంతంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును, గౌరవాన్ని, ప్రజాదరణను, పొంది మరింతపేరు ప్రఖ్యాతులు సంపాదించుకుని, అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నారు.

# స్ట్రీట్ కాజ్ స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు





### -రూ.4.50 లక్షల వ్యయంతో ఏర్పాటు
### - అభినదించిన తండా వాసులు
### - 40 మంచి నీటి క్యాన్లపంపిణి

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి,మే4,మేజర్ న్యూస్ (సూర్య):మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 10వార్డు వీరారం తండాలో స్ట్రీట్ కాజ్ స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో సుమారుగా రూ.4.50 లక్షల ఖర్చుతో నూతన ఫ్యూరిఫయిడ్ మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు.ఫ్యూరిపయిడ్ వాటర్ ప్లాంట్ ను స్ట్రీట్ కాజ్ సంస్థ బాధ్యులుకటికనేని నిహాల్ కృష్ణ ప్రారంభించారు.నిహాల్ కుమార్, నైమిషా, సునయన, రాహుల్, విశ్వనాథ్ స్ట్రీట్ కాజ్ సంస్థ బాధ్యులు ఉన్నారు. రూ.4.50లక్షల వ్యయంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి, తమకు మినరల్ వాటర్ అందించి, వారి గొప్పమనసు చాటుకున్న సంస్థబాధ్యులకు తండావాసులు ఘనస్వాగతం పలికారు. బాణోత్ రాము, హాథిరామ్ నాయక్, శంకర్ నాయక్,లచ్చిరాంనాయక్, హతిరాంనాయక్, దేవులా, గణేష్ సంస్థ బాధ్యులకు శాలువాలతో సత్కరించి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కవిత, హరిత టీమ్ 40 మంచి నీటి క్యాన్లపంపిణి మాజీ ఎంపీ కవిత,హరిత టీం టీం సభ్యులు 40 మంచి నీటి క్యాన్లను వీరారం తండా వాసులకు పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో మాజీ జెడ్పీ కో-ఆప్షన్ సభ్యులు మహబూబ్ పాషా, మానాది రాజేష్, బొడ లక్ష్మణ్ నాయక్,బండమీద సంపత్, బాణోత్ లక్ష్మణ్ నాయక్,పెద్దమాముల అంజి, పిడమర్తి ప్రశాంత్, ఉదయసాయిగౌడ్, అజయ్ కుమార్, రేఖ యాకన్న,గుగులోత్ కాశీరాం తదితరులు ఉన్నారు.

# గ్రామదేవతల ఆశీస్సులు ఉంటేనే ప్రజలు సుభిక్షంగా ఉంటారు







### మహిళలతో కలిసి బోనాన్ని అలంకరించి బోనమెత్తిన ఎర్రబెల్లి
### పాడిపంటలు సమృద్ధిగా పండాలని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు
### కడవెండిలో ఘనంగా గంగాదేవి కాటమరాజు ఉత్సవాలు
### - మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

దేవరుప్పుల మే 04 మేజర్ న్యూస్ (సూర్య):గ్రామ దేవతల ఆశీస్సులు ఉంటేనే ప్రజలు సుభిక్షంగా ఉంటారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆదివారం దేవరుప్పుల మండలంలోని కడవెండి గ్రామంలో గంగాదేవి కాటమరాజు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గంగాదేవి కాటమరాజు కళ్యాణమహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గ్రామ మహిళలతో కలిసి బోనాన్ని అలంకరించి బోనమెత్తి గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ పూర్వకాలం నుంచి ప్రతి గ్రామంలో గ్రామ దేవతలకు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. గ్రామానికి ఎలాంటి అరిష్టం జరుగకుండా ప్రజలు ఆరోగ్యంగా సు:ఖ సంతోషాలతో ఉండాలని పాడిపంటలు సమృద్ధిగా పండాలని గ్రామ దేవతకు మొక్కులు చెల్లించుకోవడంతో అంతా మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గంగాదేవి ఆలయ నిర్వాహకులకు మాజీ మంత్రి రూ.25 వేలు కానుకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద గొల్ల సుడిగెల కొమురయ్య యాదవ్ సారిగొల్ల తోటకూరి మల్లయ్య యాదవ్ పిఎసిఎస్ వైస్ చైర్మన్ నక్క రమేష్ యాదవ్ మాజీ సర్పంచ్ సుడిగెల హనుమంతు యాదవ్ గ్రామ పార్టీ అధ్యక్షులు తాటిపల్లి మహేష్ మాజీ ఎంపీటీసీ దుబ్బాక కవిత రత్నాకర్ రెడ్డి ఉడుత రాజకుమార్ యాదవ్ కాడబోయిన స్వామి యాదవ్ కావటి మల్లయ్య యాదవ్ కొమ్ము నరసయ్య యాదవ్ జిట్టే కొమురయ్య యాదవ్ మండల పార్టీ అధ్యక్షులు తీగల దయాకర్ గౌడ్ మాజీ అధ్యక్షులు బస్వ మల్లేశం మాజీ ఎంపీపీ కొల్లూరు సోమయ్య జేరిపోతుల సాయిలు కాశబోయిన నగేష్ కాశబోయిన మల్లేష్ భాషపాక అంజయ్య కత్తుల సుధాకర్ సులుగూరి మహేష్ గుమ్మడవెల్లి సోమేశ్ బాసిపాక అశోక్ కడవెండి గ్రామ యాదవ కులస్తులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పుష్పాలంకరణ వేడుకకు హాజరై చిన్నారిని ఆశీర్వదించిన ఝాన్సీ రెడ్డి



దేవరుప్పుల మే 04 మేజర్ న్యూస్ (సూర్య):దేవరుప్పుల మండల కేంద్రం కొత్తవాడకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెంకన్న - శ్రీదేవి దంపతుల కుమార్తె పుష్పాలంకరణ వేడుక మండల కేంద్రంలోని అక్షర గార్డెన్లో నిర్వహించగా ఆ వేడుకకు హాజరై చిన్నారిని ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ అనుమాండ్ల ఝాన్సీ రెడ్డి. ఈ కార్యక్రమంలో వారి వెంట మండల పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు మండల యూత్ అధ్యక్షులు పులిగిల్ల వెంకన్న బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు కాడబోయిన గణేష్ ఇనుముల నాగరాజు భూక్య సజ్జన్ నాయక్ ఎండి రసూల్ సీనియర్ నాయకులు రామచంద్రు నాయక్ తోటకూరి పాండుకృష్ణ ఎండి జాకీర్ కాడబోయిన వెంకన్న బోనగిరి యాకస్వామి రెడ్డిరాజుల రమేష్ ఓడపల్లి రవి దావెర అనిల్ రెడ్డిరాజుల రమేష్ ఓడపల్లి పుల్లయ్య జక్కుల గంగరాజు గుగులోతు లొడంగి వెంకన్న రాజేందర్ ఎన్.ఎస్.యూ.ఐ మండల అధ్యక్షుడు కొంగరి ఉమేష్ మండల ముఖ్య నాయకులు సోషల్ మీడియా కోఆర్డినేటర్లు మాసంపల్లి సాత్విక్ గనుపాక ప్రదీప్ లోడింగి అశోక్ గ్రామ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా నీట్ పరీక్ష



మహబూబాబాద్ ప్రతినిధి, మే 4,మేజర్ న్యూస్ (సూర్య):మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని టిజిఎస్ డబ్ల్యూ ఆర్ జూనియర్ గర్ల్స్ కాలేజ్ లో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ తెలిపారు.పరీక్ష కేంద్రంలో 523 మంది విద్యార్థులకు గాను నీట్ పరీక్షలలో 494 మంది పరీక్షలకు హాజరుకాగా 19 మంది గైహాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో “వర్గపోరు”..!

### మితిమీరిన ఇందిరమ్మ కమిటీల జోక్యంతో కుమ్ములాట..?

### ముగ్గురు కాంగ్రెస్ నాయకులను బహిష్కరిస్తున్నట్లు ప్రకటన



భీమదేవరపల్లి, మే 04(మేజర్ న్యూస్ సూర్య):హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంతో వర్గ పోరుకు దారితీసింది. ఇందిరమ్మ కమిటీల మితిమీరిన జోక్యంతో కాంగ్రెస్ నాయకుల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. లబ్దిదారుల ఎంపిక పూర్తిగా ఇందిరమ్మ కమిటీల కనుసన్నల్లోనే నడుస్తుండడంతో వివాదస్పదంగా మారుతున్నది. మండలంలోని గట్లనర్సింగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అనర్హులను ఎంపిక చేశారని గ్రామానికి చెందిన హుస్నాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ బొల్లంపల్లి కాంతారావు, మరో ఇద్దరు నాయకులు (బొల్లంపల్లి షెడ్రక్, అంబాల రాజ్ కుమార్) లు ఇందిరమ్మ కమిటీ సభ్యులను నిలదీశారు. ఎంపిక జాబితాలో అనర్హులను తొలగించి నిరుపేదలకు అవకాశం కల్పించాలని సూచించారు. ఈ క్రమంలో మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుల ఆదేశాల మేరకు గ్రామ శాఖ అధ్యక్షులు గూళ్ల పూర్ణచందర్, ముగ్గురిని కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు మీడియాకు ఆదివారం వెల్లడించారు. పార్టీ సిద్ధాంతాలకు, కార్యకలాపాలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు ముగ్గురిని పార్టీ నుండి బహిష్కరించినట్లు పూర్ణచందర్ తెలిపారు. దీంతో మండల వ్యాప్తంగా జోరుగా చర్చ కొనసాగుతోంది. నియోజకవర్గ స్థాయి యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గా ఉన్న బొల్లంపల్లి కాంతారావు ను, ఒక గ్రామ శాఖ అధ్యక్షుడు ఏ విధంగా పార్టీ నుండి బహిష్కరిస్తాడు అనే సందేహాలు కాంగ్రెస్ పార్టీలో తలెత్తుతున్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక విధానంలో కమిటీ సభ్యుల జోక్యం ఎక్కువగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.

# మే 20 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సహకరించండి



తొర్రూర్ మే 4 మేజర్ న్యూస్ (సూర్య).మే 20 న దేశవ్యాప్తంగా జాతీయ కార్మిక సంఘాలు జరపతలపెట్టిన 23వ సార్వత్రిక సమ్మెకు సహకరించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఓమ బిక్షపతి,టి యు సి ఐ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి, సిఐటియు మండల కార్యదర్శి జమ్మల శ్రీనులి లు కోరారు. మే 20 జరుప తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు సహకారం అందించాలని తొర్రూర్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మచ్చ సురేష్లి కు నేడు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నోటీస్ ఇవ్వడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలో 45 కోట్ల మంది కార్మిక వర్గానికి నష్టం తీసుకొచ్చే నాలుగు లేబర్ కోళ్లను ఉపసంహరించి కార్మిక హక్కులను కాపాడాలని వారు కోరారు. వర్తక,వాణిజ్య,వ్యాపార వర్గాలు సార్వత్రిక సమ్మెకు సహకరించాలని కోరారు. కార్మిక వర్గం శ్రమతో ఉత్పత్తి,ఎగుమతి దిగుమతి లాంటి ముఖ్యమైన కీలక స్థానాలలో పనిచేస్తున్నారని వారి శ్రమకు తగ్గ ప్రతిఫలం దక్కకుండా కార్పొరేట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చే లేబర్ కోడ్ తిరస్కరించాలని వారు కోరారు. పాలకుల విధానాల మూలంగా ఆకాశాలంటుతున్న అనేక రకాల ధరలతో సాధారణ కార్మిక వర్గంపై ఆర్థిక బారాల వల్ల పుండు పై కారం జల్లిన విదంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ప్రతి కార్మికుడికి కనీస వేతనం 26000 ఇవ్వాలని డిమాండ్ ఎంతో న్యాయమైందని వారు పునరుద్ఘాటించారు. అదేవిధంగా 2016 లో సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఒక తీర్పులో నేటి ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇంకా తదితర డిమాండ్లపై దేశవ్యాప్తంగా సుమారు 45 కోట్ల మంది కార్మికులు మే 20న వీధుల్లోకి వచ్చి తమ హక్కులకై నిడదీస్తారని వారు తెలిపారు. మే 20న వర్ధక వ్యాణిద్య వ్యాపార సహకరించాలని కార్మిక సంఘాల నేతలు చేసిన విజ్ఞప్తికి ఆయన సానుకూలంగా స్పందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో టియుసిఐ తొర్రూర్ ఏరియా కమిటీ అధ్యక్షుడు శ్రీరాం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# గద్దర్ అన్న ఐకాన్ అవార్డు అందుకున్న జవ్వాజి ప్రవీణ్ కుమార్



కొడకండ్ల మే 04 మేజర్ న్యూస్ (సూర్య):కొడకండ్ల మండల కేంద్రానికి చెందిన కవి గాయకుడు జవ్వాజి ప్రవీణ్ కుమార్ ఆదివారం హైదరాబాద్ బిర్లా సైన్స్ సెంటర్ భాస్కర ఆడిటోరియంలో సాయి అలేఖ్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జానపదం మా ప్రాణపదం గద్దర్ అన్న ఐకాన్ 2025 అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, తెలంగాణ టూరిజం శాఖ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, అరుణోదయ సంస్థ వ్యవస్థాపకులు కవి గాయకురాలు విమలక్క, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్, తెలంగాణ ఉద్యమ జేఏసీ నాయకులు కవి గాయకులు దరువు అంజన్న జువ్వాజి ప్రవీణ్ కుమార్ ను శాలువాతో ఘనంగా సత్కరించి గద్దర్ అన్న ఐకాన్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగాజవ్వాజి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూతెలంగాణ తొలి దశ మలిదశ ఉద్యమంలో పని చేసిన ఎంతో మంది కవి గాయకులను కళాకారులను గుర్తించి వారందరికీ ఈ గద్దర్ అవార్డ్స్ ప్రధానం చేయడం చాలా సంతోషకరమని అలాగే పాటల పూదోట పాటల పెద్దన్న ఉద్యమానికి ఊపిరి పోసి తెలంగాణ యావత్ ప్రపంచాన్ని తన ఆట - పాట ద్వారా తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం అహర్నిశలు కృషిచేసి ఎంతోమంది కవులు కళాకారులను ఏకం చేసి ఉద్యమానికి ఊపిరి పోసిన గద్దర్ అన్న అడుగులో అడుగు వేస్తూ అన్న చూపిన బాటలోనే ఎంతో మంది కవులు గాయకులు గద్దర్ అన్న ఆశయాన్ని స్ఫూర్తిగా తీసుకొని పాటే ప్రాణంగా నమ్ముకొని పాటతోటే జీవిస్తాం పాటతోటే మరణిస్తామనే విధంగా అందరిని మమేకం చేస్తూ గద్దర్ అన్న ఆశయాలను పునికి పుచ్చుకొని గద్దర్ అన్న ఏర్పాటు చేసిన సమ సమాజ స్థాపనకు నిశ్శబ్ద విప్లవానికి ఓటు హక్కుతోటే మన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి బంగారు బాటలు వేసిన గద్దర్ అన్న భౌతికంగా మన మధ్యలో లేకపోయినా అన్న చూపిన ఆశయాలు అడుగుజాడలు అన్న చూపించిన పోరుబాట ఎప్పటికీ ఎన్నటికీ మరచిపోనివి మరపురానివి భవిష్యత్తు తరానికి ఆదర్శ సూత్రాలుగా ఎప్పుడు చిరస్థాయిగా నిలిచిపోతాయి. అదే గద్దర్ అన్న ఆశయం గత ప్రభుత్వంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కొంత మందికి మాత్రమే ఉద్యోగ అవకాశాలు కల్పించి అసలైన ఉద్యమకారులను విస్మరించింది అయినా కూడా కళాకారులు మొక్కవోని దీక్షతో ఆటుపోటులను ఎదుర్కొంటూ పాటల ప్రపంచంలోనే విహరిస్తూ బతుకు జీవనాన్ని కొనసాగిస్తూ దుర్భరమైన జీవితాలను అనుభవిస్తూ ఒక్క పూట తిండి తినలేనటువంటి పరిస్థితిలో ఈరోజు కళాకారులు ఉన్నారని, ఈ ప్రజాపాలన ప్రభుత్వంలోనైనా కళాకారులకు తెలంగాణ సాంస్కృతిక సారధిలో 1000 ఉద్యోగాలు కల్పించి కళాకారులను ఆదుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ అవార్డుకు ఎంపిక చేసిన సాయి అలేఖ్య సాంస్కృతిక సేవా సంస్థ నిర్వాహకులు ఉపదుష్ట అరుణ అశోక్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు ఉద్యమ కళాభివందనాలు తెలుపుతున్నానని అన్నారు.